Follow: @ANNTELUGU
13-05-2026
# మహా పత్రిక
ANN తెలుగు
బుధవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 136 | పేజీలు-08 | వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI | REGISTERED NUMBER: APTEL/2003/09316 | WWW.EPAPER.MAHAADAILY.COM


మహా కథనంతో
కదిలిన యంత్రాంగం
కొండాపూర్ అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా
కళ్లు తెరిచిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు.. తక్షణ చర్యలకు రంగం సిద్ధం
రూ. 10 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ,
7 అంతస్తుల నిర్మాణ బాగోతంపై 'మహా పత్రిక' సంచలన కథనం
అక్రమార్కుల గుండెల్లో గుబులు..
వంతపాడిన అధికారుల పైనా వేటుకు కసరత్తు
బరితెగించిన అక్రమార్కులు
కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతు
మహా ఎఫెక్ట్

## రూ.10 కోట్ల ప్రభుత్వ స్థలానికి
# మహా రక్ష

- మహా కథనంతో కదిలిన అధికారులు
- భవనం సీజ్ కు నిర్ణయం.. త్వరలో కూల్చివేసే అవకాశం
- ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు
- కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడతాం
- సర్వే నెంబర్ 59 లో గల భవనాన్ని స్వాధీనం చేసుకుంటాం
- తహసీల్దార్ మహిపాల్ రెడ్డి

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

## భారత్ సొంత ఏఐ ఇన్‌ఫ్రాను నిర్మించుకోవాలి



- అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వ్యాఖ్యలు

02

## పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ



- ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా అంటూ లోకేష్ ట్వీట్
- ఈ ప్రాజెక్టుతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు


02

## జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇండ్ల సెకండ్ ఫేజ్



- ఆదిలాబాద్ నుంచి శ్రీకారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

03



సత్యదేవుని సన్నిధిలో..
# దళారీ దందా
## అధికారుల నిర్లక్ష్యం

అన్నవరం దేవస్థానంలో అక్రమాల ఆరోపణలు

భద్రతా లోపాలు, నిర్వహణ నిర్లక్ష్యంపై భక్తుల రుసరుస

**కాకినాడ జిల్లా ప్రతినిధి, మహా:** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి అన్నవరం దేవస్థానం ఈ పవిత్ర క్షేత్రంలో దళారీ వ్యవస్థ, ప్రోటోకాల్ దుర్వినియోగం, అధికారుల నిర్లక్ష్యం, భద్రతా వైఫల్యాలు, రాజకీయ అండదండలు వంటి అంశాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల ఆరోపణల ప్రకారం, కొందరు సిబ్బంది తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో బయటి వ్యక్తులను ఉచిత దర్శనాలకు పంపిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

మిగతా 2లో





# వర్క్ ఫ్రమ్ హోమ్ 2.0

- సౌకర్యం కాదు.. ఇపుడు దేశభక్తి
- ఐటీ కారిడార్‌లో 'చమురు' సెగ
- మళ్లీ ఇంటి బాటలో సాఫ్ట్ వేర్ లోకం
- కుదేలు కానున్న అనుబంధరంగాలు

**హైదరాబాద్, మహా :** నిన్నటి దాకా 'ఆఫీసుకి రండి' అంటూ హుకుం జారీ చేసిన ఐటీ కంపెనీలు, ఇప్పుడు 'ఇంటి నుంచే పని చేయండి' అంటూ రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. దీనికి కారణం కోవిడ్ మహమ్మారి కాదు.. వేల మైళ్ల దూరంలో గల్ఫ్ దేశాల మధ్య రగులుతున్న 'చమురు సెగ'. ప్రపంచం చమురు సంక్షోభం దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సూచనలు ఇప్పుడు ఐటీ రంగంలో పెను మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్' అనేది ఇప్పుడు కేవలం సౌకర్యం కాదు, అదొక దేశ భక్తిగా మారుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించలేక లేదా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వెంటనే అందుబాటులోకి తేలేక, ప్రభుత్వం ఇలాంటి వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి తాత్కాలిక పరిష్కారాలను ఉద్యోగులపై రుద్దుతోందని ప్రతిపక్షాలు , కొందరు ఆర్థికవేత్తలు విమర్శిస్తున్నారు. దేశ ఇంధన భద్రత దృష్ట్యా ప్రధాని సూచనలు సరైనవే అయినప్పటికీ, దానివల్ల అనుబంధ రంగాలపై పడే ప్రభావాన్ని తగ్గించేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

మిగతా 2లో



## పెట్రోల్ మంట.. సాఫ్ట్ వేర్ చింత

గల్ఫ్ సంక్షోభం కారణంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రధాని మోదీ రంగంలోకి దిగారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ఆయన ఇచ్చిన పిలుపుతో ఐటీ రంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది.



# ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన రశీదులు ఇవ్వాలి

డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి

జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:** ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిగతా 2లో




నీట్ యూజీ 2026
# పరీక్ష రద్దు

- 22 లక్షల మంది విద్యార్థులకు షాక్
- పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు
- 15 మందిని అరెస్టు చేసిన దర్యాప్తు సంస్థ
- అధికారికంగా ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ
- ఢిల్లీలోని ఎన్ టీఏ ముందు విద్యార్థుల తలిదండ్రుల ఆందోళన
- ప్రభుత్వ అసమర్థతత అన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

వివరాలు 2లో

# సర్ డేంజర్‌పై కేసీఆర్ నజర్

## 71 వేల మందితో గులాబీ హైటెక్ సైన్యం

పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున సభ్యత్వ నమోదు

ఎన్నికల సంఘానికి ధీటుగా డిజిటల్ మెంబర్‌షిప్

14 మంది ఇంచార్జీలతో ఆరు గంటల కేసీఆర్ సుదీర్ఘ మథనం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై మరోసారి తనదైన మార్క్ వేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమయ్యారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వేదికగా సుమారు ఆరు గంటల పాటు పార్టీ ముఖ్య నేతలతో సుదీర్ఘసమావేశం నిర్వహించారు. సర్ డేంజర్ తోనే పశ్చిమబెంగాల్, తమిళనాడులో దుర్భేద్యసైన్యమున్నా.. ప్రాంతీయ పార్టీలు ఓడాయని భావిస్తున్న కేసీఆర్.. తెలంగాణలో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని డిసైడ్ అయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ కూడా అదే స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 2లో

# నన్ను కెలికారు.. ఎవరినీ వదిలిపెట్టను

కరీంనగర్ వేదికగా కేంద్రమంత్రి బండిసంజయ్ వార్నింగ్ | నా కుటుంబానికి పెట్టిన నిప్పుతో మీ సామ్రాజ్యాలనే తగలబెడతా | తప్పు చేస్తే నా కొడుకైనా శిక్ష అనుభవించాల్సిందే | హనుమాన్ జయంతి వేళ ఉద్వేగభరిత ప్రసంగం

**కరీంనగర్, మహా:** "నన్ను కెలికారు, నా కుటుంబానికి నిప్పంటించారు. రావణుడు హనుమంతుడి తోకకు నిప్పు పెడితే లంక దహనమైనట్లే, నా కుటుంబానికి మీరు పెట్టిన నిప్పుతోనే మీ అవినీతి సామ్రాజ్యాలను, గడీలను బద్దలు కొడతాను. నా కుటుంబాన్ని, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టను. దగ్ధం చేస్తా" కేంద్రమంత్రి బండిసంజయ్ అని హెచ్చరించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్ర జన ప్రభంజనాన్ని తలపించింది. వైశ్యా భవన్ నుండి ప్రారంభమైన ఈ యాత్రలో వేలాది మంది కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులు పాల్గొనడంతో కరీంనగర్ వీధులు జనసంద్రమయ్యాయి. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా విచ్చేసిన హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి మాట్లాడుతూ, బండి సంజయ్ హిందూ ధర్మ పరిరక్షకుడని, ఆయనకు ప్రతి హిందువు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. "ఏ తప్పు చేయలేదని



నా కొడుకు చెబుతున్నాడు, కానీ నిజానిజాలు కోర్టులే తేలుస్తాయి. ఒకవేళ తప్పు చేసినట్లు తేలితే వాడు ఖచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే, కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం" అని స్పష్టం చేశారు. "సమాజమే నా కుటుంబం అనుకున్నాను. హార్ట్‌లో స్టంట్ ఉన్నా లెక్కచేయకుండా 1600 కిలోమీటర్లు నడిచాను. 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలేదు. కానీ, ఈ పోరాటంలో నా కొడుకుకు తగినంత సమయం ఇవ్వలేకపోయాను. వాడు ఇవాళ ఇలాంటి పరిస్థితుల్లో ఉండటానికి కారణం నా తప్పు కూడా ఉండొచ్చు. నన్ను క్షమించండి" అని తెలంగాణ సమాజాన్ని కోరారు. తన భార్య కూడా కార్యకర్తలకు అండగా ఉంటూ తన బాటలోనే నడుస్తోందని అన్నారు.

# హైకోర్టుకు చేరిన బండి భగీరథ్ కేసు



- బండి భగీరథ్‌పై మరిన్ని సెక్షన్లు
- నేడు స్టేషన్‌లో విచారణ

02

# వర్క్ ఫ్రమ్ హోమ్ 2.0

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో పనిచేసే రమేష్ ఉదాహరణే తీసుకుంటే.. రోజుకు తన బైక్ మీద ఆఫీస్‌కి వెళ్లి రావడానికి 2 లీటర్ల పెట్రోల్ ఖర్చవుతుంది. ఇలా లక్షలాది మంది ఉద్యోగులు రోడ్డు మీదకు వస్తే, రోజుకు కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యం కేవలం 'పొగ' రూపంలో ఆవిరైపోతోంది. అందుకే, 'వర్క్ ఫ్రమ్ హోమ్' అనేది ఇప్పుడు కేవలం సౌకర్యం కాదు, అదొక దేశభక్తిగా మారుతోంది.

**ఎందుకు ఇలా?**

**ఇంధన భద్రత - దేశ ఆర్థిక రక్షణ**

భారతదేశం తన చమురు అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంది. హర్మూజ్ జలసంధి వంటి కీలక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరిగితే, సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

**ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రకటించడం వల్ల:**

నగరాల్లో లక్షలాది వాహనాల రాకపోకలు ఆగుతాయి. నెలవారీగా కోట్ల లీటర్ల ఇంధనం ఆదా అవుతుంది. ప్రభుత్వంపై దిగుమతి భారం తగ్గుతుంది.

**కంపెనీల కొత్త లెక్కలు**

గత మూడేళ్లుగా ఆఫీసులను తెరిచి ఉంచేందుకు కంపెనీలు భారీగా విద్యుత్, డీజిల్ జనరేటర్ల మీద ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడు ఇంధన ధరలు పెరిగితే ఆపరేషన్ కాస్ట్ తడిసి మోపెడవుతుంది. అందుకే 'హైబ్రిడ్ మోడల్' లేదా 'పూర్తిస్థాయి రిమోట్ వర్క్' వైపు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ట్రాఫిక్ తగ్గిపోవడం వల్ల గాలి కాలుష్యం తగ్గడమే కాకుండా, ఉద్యోగుల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది. నాస్కామ్ నివేదిక ప్రకారం, ఈ చర్య వల్ల మెట్రో నగరాల్లో కార్బన్ ఉద్గారాలు 20% వరకు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఇది కేవలం 'సూచన' మాత్రమే. కానీ ఇంధన సంక్షోభం మరింత ముదిరితే, ఐటీ ఉద్యోగుల సంఘం కోరుతున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం దీనిని 'తప్పనిసరి' చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంటి నుండి పని చేయడం వల్ల కేవలం అతని పెట్రోల్ డబ్బులు మాత్రమే ఆదా అవ్వడం లేదు.. దేశం యొక్క అమూల్యమైన విదేశీ నిల్వలు ఆదా అవుతున్నాయి. అటు పర్యావరణం, ఇటు ఆర్థిక వ్యవస్థ రెండూ లాభపడే ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్ 2.0' వెర్షన్ సత్ఫలితాలను ఇస్తుందని కేంద్రం భావిస్తోంది.

**మోదీ మార్కు 'ఇంధన పొదుపు' వ్యూహం**

ప్రధాని సూచన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడటం. ఐటీ హబ్‌లైన హైదరాబాద్, బెంగళూరు, పుణేలలో లక్షలాది వాహనాలు రోడ్డెక్కకుండా ఉంటే, నెలకు వేల కోట్ల రూపాయల విలువైన పెట్రోల్ ఆదా అవుతుంది.

**నాస్కామ్ రియాక్షన్**

ప్రధాని సూచనలను అందుకున్న వెంటనే నాస్కామ్ తన కార్యకలాపాలను వేగవంతం చేసింది. ఇప్పటికే ప్రధాన కంపెనీలు తమ క్యాంపస్‌లలో ఏసీలు, లైటింగ్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా 'గ్రీన్ ఎనర్జీ' వైపు అడుగులు వేస్తున్నాయి.

**ఉద్యోగ సంఘాల మద్దతు:**

నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ కూడా ప్రధాని సూచనలను స్వాగతించింది. "ప్రధాని చెప్పినట్లుగా వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేస్తే, ఉద్యోగులపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా దేశానికి ఇంధన భద్రత లభిస్తుంది" అని వారు అభిప్రాయపడుతున్నారు.

**సామాన్యుడి నుంచి సాఫ్ట్‌వేర్ దాకా..**

హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం ఐటీ కంపెనీల ఆలోచనా విధానాన్ని మార్చివేసింది. ఆయన ముఖ్యంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

**వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరణ:**

కోవిడ్ సమయంలో మనం అలవాటు పడిన రిమోట్ వర్కింగ్ విధానాన్ని మళ్ళీ తెరపైకి తేవాలని, తద్వారా అనవసర ప్రయాణాలను తగ్గించాలని కోరారు.

**వర్చువల్ మీటింగ్స్:**

ముఖాముఖి సమావేశాల కంటే వీడియో కాన్ఫరెన్సింగ్‌లకే ప్రాధాన్యత ఇవ్వాలని, ఇది సమయాన్ని మరియు ఇంధనాన్ని రెండింటినీ ఆదా చేస్తుందని తెలిపారు.

**ప్రజా రవాణా & మెట్రో:**

సొంత వాహనాలను పక్కన పెట్టి, మెట్రో రైళ్లు మరియు బస్సు సేవలను వినియోగించుకోవాలని ఐటీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

**కార్ పూలింగ్:**

ఒకే ఆఫీసు లేదా ఒకే రూట్‌లో వెళ్లే వారు 'కార్ పూలింగ్' విధానాన్ని అనుసరించడం ద్వారా రహదారులపై ఒత్తిడి తగ్గించవచ్చని సూచించారు.

**ఎలక్ట్రిక్ వాహనాలు :**


భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పెట్రోల్/డీజిల్ వాహనాల నుండి ఈవీల వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని నొక్కి చెప్పారు. ఐటీ కంపెనీలు మళ్ళీ వర్క్ ఫ్రమ్ హోమ్ కి వెళ్తే, ఐటీ హబ్‌లైన గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఉన్న కమర్షియల్ రియల్ ఎస్టేట్ తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఆఫీసుల చుట్టుపక్కల ఉండే ఫుడ్ కోర్టులు, పీజీలు , రవాణా రంగాలు (క్యాబ్ డ్రైవర్లు) ఆర్థికంగా కుదేలయ్యే ప్రమాదం ఉంది.

**కేంద్రవైఫల్య ఫలితం: రాహుల్ గాంధీ**

"చమురు ధరలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఆ భారాన్ని ప్రజల మీదకు నెట్టేస్తోంది. 'వర్క్ ఫ్రమ్ హోమ్' అనేది ఒక పరిష్కారం కాదు, అది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం" అని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శించారు.

# నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు

- 22 లక్షల మంది విద్యార్థులకు షాక్
- పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు
- 15 మందిని అరెస్టు చేసిన దర్యాప్తు సంస్థ
- అధికారికంగా ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
- ఢిల్లీలోని ఎన్‌టీఏ ముందు విద్యార్థుల తలిదండ్రుల ఆందోళన
- ప్రభుత్వ అసమర్థతత అన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ




**ఢిల్లీ, మహా :** నీట్ యూజీ 2026 ఎగ్జామ్ రద్దు అయింది. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం వెల్లడించింది. పేపర్ లీకేజీ ఆరోపణలతో విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని ఈ నీట్ యూజీ ఎగ్జామ్ రద్దు చేసినట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. పేపర్ లీకేజీపై కొన్ని రోజులనుంచి దుమారం రేగగా, ఎన్టీఏ ఈ నిర్ణయం తీసుకుంది. 22లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయగా, నీట్ రద్దుతో దేశవ్యాప్తంగా అలజడి నెలకొంది. ఇది ప్రభుత్వ అసమర్థత అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.

**రాజస్తాన్‌లో మొదలైన వివాదం**

రాజస్థాన్‌లో నీట్ వివాదం చివరికి కొలిక్కి వచ్చింది. దాదాపు 125 ప్రశ్నలు లీకయ్యాయని ఆ క్వశ్చన్స్ ఓ శాంపిల్ పేపర్‌తో యథాతథంగా మ్యాచ్ కావడంతో వివాదం మొదలైంది. అప్పటి నుండి ఎగ్జామ్ రద్దు అవుతుందని వినిపించింది. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని ఎన్టీఏ మే 3న జరిగిన ఈ పరీక్షను రద్దు చేయడంతో పాటు మళ్లీ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. నీట్ యూజీ ఎగ్జామ్ కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తారు. విద్యార్థులు మళ్ళీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన పనిలేదు. అయితే అడ్మిట్ కార్డులను జారీ చేస్తారు. మే 3 న రాసిన పరీక్ష కేంద్రంలోనే అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తు చేయనుంది. విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మరాదని కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచించారు. రాజస్థాన్ సహా కొన్ని రాష్ట్రాల్లో సాధారణ శాంపిల్ పేపర్‌లో ఉన్న సుమారు 125 ప్రశ్నలు నీట్ పేపర్‌తో అచ్చుగుద్దినట్లు సరిపోలాయని వివాదం మొదలైంది. ఆ తర్వాత పరీక్ష నిర్వహణ, పేపర్ లీకేజీపై వరుసగా ప్రశ్నలు తలెత్తాయని ఎన్టీఏ తెలిపింది. ప్రస్తుతం ఉన్న పరీక్షా ప్రక్రియను కొనసాగించలేమని గుర్తించడంతో, ఎన్టీఏ నీట్ యూజీ ఎగ్జామ్ రద్దు చేయాలని నిర్ణయించింది.

**పారదర్శకతకు కట్టుబడి ఉన్నామన్న ఎన్ టీఏ**

ఎన్ టీఏ తన 10 మే 2026 నాటి ప్రెస్ రిలీజ్ తర్వాత ఒక కొత్త ప్రకటన విడుదల చేసింది. అందులో 8 మే న నీట్ యూజీ 2026కు సంబంధించిన కొన్ని అంశాలను విచారణ కోసం కేంద్ర సంస్థలకు పంపినట్లు పేర్కొంది. ఈ పరీక్షకు సంబంధించి కొన్ని ఫిర్యాదులు, అవకతవకలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై విచారణ జరగాలని భావించాం. ఎగ్జామ్ నిబద్ధత, విద్యార్థుల భవిష్యత్ కోసం ఈ అంశాలపై స్వతంత్ర విచారణ జరిపిస్తామని తెలిపింది. అందుకే, వాస్తవాలను ధృవీకరించడానికి, బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించింది. జాతీయ స్థాయి పరీక్షలను "ఫెయిర్, సెక్యూర్ అండ్ క్రెడిబుల్" గా నమ్మదగిన రీతిలో నిర్వహించడానికి తాము కట్టుబడి ఉన్నామని ఎన్ టీఏ పేర్కొంది. దాంతోపాటు ఎగ్జామ్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. సీబీఐ ఈ కీలకమైన కేసును దర్యాప్తు చేసి నిజాలను వెలికితీయనుంది.

**మండిపడ్డ రాహుల్ గాంధీ**

నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ అసమర్థత కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థులు రోజుల కొద్దీ పడ్డ శ్రమను మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ విద్యార్థులకు చెప్పేది ఒక రకంగా ఉంటే చేసేది మాత్రం అందుకు భిన్నంగా ఉంటుందని మండిపడ్డారు. ఎంతో మంది విద్యార్థుల తలితండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం బంగారు నగలను అమ్మి ఆ డబ్బుతో వారిని చదివించారని అలాంటి వారి శ్రమ అంతా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్టీఏ ముందు అట్టుడికిన ఆందోళన**

నీట్ యూజీ పరీక్షను రద్దు చేస్తూ ఎన్ టీఏ తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు, తలి దండ్రుల్లో ఒక్కసారిగా ఆక్రోషం పెల్లుబికింది. పరీక్ష రద్దు చేశారన్న విషయం తెలుసుకున్న వెంటనే వేలాది మంది ఎన్ టీఏ కార్యాలయం ముందుకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి చేయి దాటకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎన్ టీఏ కార్యాలయం ముందే కాకుండా దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో ఆందోళనలు మిన్నంటాయి.

**లీకేజీ ముఠాకు చెందిన 15 మంది అరెస్టు**

నీట్ యూజీ 2026 పరీక్ష పత్రం లీకేజీ సూత్రదారులతో పాటు పాత్ర దారులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. రాజస్థాని కేంద్రంగా ముఠా పేపర్ లీక్ చేసినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు 15 మందిని అరస్టు చేశారు. వీరిలో రాజస్థాన్ తో పాటు మహారాష్ట్రకు చెందిన వారు కూడా ఉన్నారు. పరీక్ష 8 వ తేదీన జరుగగా ముఠా రెండవ తేదీనే పేపర్ ను బయటకు తీసుకు వచ్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత గెస క్వశ్చన్ పేపర్ తో మార్కెట్ లో చెలాణి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పేపర్ లో మాస్టర్ మైండ్ గా ఉన్న మనీష్ యాదవ్ కీలకుదని, అక్కడి నుంచి హర్యానా,, నాసిక్ తదితర ప్రాంతాలకు పంపినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది.

## రూ.10కోట్ల ప్రభుత్వ స్థలానికి
# మహా రక్ష

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. కొండాపూర్ సర్వే నెంబర్ 59లో గల ప్రభుత్వ భూమి గల్లంతు అనే వార్త కథనాన్ని మహా పత్రిక ప్రచురించటంతో ఆ కథనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆమేరకు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. కొండాపూర్ సర్వే నెంబర్ 59 లో గల 600 చదరపు గజాల భూమిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న బహుళంతస్తుల భవనాన్ని స్వాధీనం చేసుకుంటామని శేలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి మహా పత్రిక ప్రతినిధికి తెలిపారు. ప్రభుత్వ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి జీ హెచ్ ఎం సీ నుండి నిర్మాణ అనుమతులు పొందారని, ఆ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలనీ లేఖ రాసామన్నారు. ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా సరే వదిలి పెట్టమన్నారు. అలాగే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మండల పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే జైలుకు వెళతారని ఆయన హెచ్చరించారు. కాగా ఈ భవనాన్ని సీజ్ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. రూ.10కోట్లకు పైగా విలువైన సకథలం కబ్జాకు యత్నించిన అక్రమార్కుల భాగోతం బయటపడగా, త్వరలో భవనాన్ని అధికారులు కూల్చివేసే అవకాశముందన్న చర్చ జరుగుతోంది.

## సర్ డేంజర్‌పై
# కేసీఆర్ నజర్



(మొదటిపేజీ తరువాయి)

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇకపై కాగితాలకు పరిమితం చేయకుండా, పూర్తిగా డిజిటల్ పద్ధతిలో అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని తీర్మానించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,655 పోలింగ్ బూత్‌లను లక్ష్యంగా చేసుకుని పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

**71,310 మందితో గులాబీ హైటెక్ సైన్యం**

ఈ బృహత్తర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఒక్కో బూత్‌కు ఇద్దరు చొప్పున ఏకంగా 71,310 మంది కార్యకర్తలతో ఒక మహా 'డిజిటల్ సైన్యాన్ని' సిద్ధం చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో క్షేత్రస్థాయి కార్యకర్తలకు డిజిటల్ విధానాలపై పార్టీ ప్రధాన కార్యదర్శుల ప్రత్యక్ష పర్యవేక్షణలో శిక్షణా తరగతులు, అవగాహనా శిబిరాలు నిర్వహించనున్నారు. కేవలం రెండు, మూడు రోజుల్లోనే ప్రతి మండలానికి, మున్సిపల్ బాడీల వారీగా సభ్యత్వ సమన్వయ కమిటీలను నియమించాలని అధినేత స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ నుండి ఒక సభ్యత్వ సమన్వయకర్తను ప్రత్యేకంగా నియమించనున్నారు.

**సీనియర్లకు జిల్లాల బాధ్యతలు**

ఈ డిజిటల్ మహా వ్యూహాన్ని విజయవంతంగా అమలు చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల బాధ్యతలను పార్టీలోని అత్యంత సీనియర్ నేతలకు కేసీఆర్ అప్పగించారు. రాజధాని హైదరాబాద్ జిల్లా బాధ్యతలను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఇవ్వగా, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలను సబితా ఇంద్రారెడ్డికి అప్పగించారు. ఉత్తర తెలంగాణలో పట్టు నిలుపుకునేందుకు జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు మాజీ మంత్రి జీవన్ రెడ్డిని రంగాన దించారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు తక్కళ్లపల్లి రవీందర్ రావు, జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇంచార్జీలుగా వ్యవహరిస్తారు. గిరిజన ప్రాబల్యం ఉన్న ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో గులాబీ జెండా ఎగురవేసే బాధ్యతను సత్యవతి రాథోడ్ స్వీకరించారు. ఉమ్మడి మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలను గ్యాదరి బాలమల్లు పర్యవేక్షించనుండగా, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను గంగాధర్ గౌడ్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను నారదాసు లక్ష్మణ్ రావు సమన్వయం చేయనున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఇంచార్జీగా రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తారు. దక్షిణ తెలంగాణలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పగ్గాలను మాజీ హోంమంత్రి మహమూద్ అలీకి అప్పగించారు. గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల సమన్వయకర్తగా మెట్టు శ్రీనివాస్, నల్గొండ మరియు సూర్యాపేట జిల్లాల బాధ్యుడిగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వ్యవహరించనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి జిల్లాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ముందుకు నడిపించనున్నారు.

ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్దండులైన నాయకులను రంగంలోకి దించి, వారి ఆధ్వర్యంలో డిజిటల్ సైన్యాన్ని నడిపించడం ద్వారా రాబోయే ఎన్నికల నాటికి పార్టీని క్షేత్రస్థాయిలో అజేయ శక్తిగా మార్చేందుకు కేసీఆర్ వేసిన ఈ వ్యూహం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.



# హైకోర్టుకు చేరిన బండి భగీరథ్ కేసు


- బండి భగీరథ్‌పై మరిన్ని సెక్షన్లు
- నేడు స్టేషన్‌లో విచారణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు బండి భగీరథ్ కేసు హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతూ ఉత్కంఠ రేపుతోంది. తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ భగీరథ్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈ నెల 14న విచారణ జరగనుంది. అయితే కోర్టు తీర్పు రాకముందే పోలీసులు రంగంలోకి దిగారు. నేటి మధ్యాహ్నం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు రావాలని భగీరథ్‌కు నోటీసులు ఇచ్చారు. పోలీసులు ఆయన ఇంటికి వెళ్లినప్పుడు ఆయన అక్కడ లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియజేశారు. ఈ కేసులో పోలీసులు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. బాధితురాలి నుంచి మరోసారి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు, కేసు తీవ్రతను పెంచుతూ కొత్తగా పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను చేర్చారు. దీంతో ఈ కేసు మరింత సీరియస్‌గా మారింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా నేరుగా జోక్యం చేసుకున్నారు. పోలీసు అధికారులతో మాట్లాడి, విచారణలో ఎలాంటి అశ్రద్ధ చూపవద్దని, పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. దీంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, బాధితురాలికి న్యాయం చేస్తామని చెబుతున్నారు.

## పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో
# యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ

### ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా అంటూ లోకేష్ ట్వీట్
### ఈ ప్రాజెక్టుతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు

**మరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. "మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?" అంటూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. దీనికి జతగా, ఓ అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఆకాశంలోకి దూసుకెళ్తున్న ఏఐ (ఏఐ) వీడియోను కూడా పంచుకున్నారు. ఈ పోస్ట్ ద్వారా పుట్టపర్తిలో రాబోతున్న భారీ ప్రాజెక్టుపై ఆయన అంచనాలను పెంచారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతంలో సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పాదనను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో, మంత్రి నారా లోకేష్ చేసిన ఈ టీజర్ ట్వీట్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది.



## ధాన్యం కొనుగోళ్ళు
# సజావుగా జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎం లను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ* రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## భారత్ సొంత ఏఐ ఇన్‌ఫ్రాను
# నిర్మించుకోవాలి

### అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వ్యాఖ్యలు

**మహా:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థకు సంబంధించి భారత్ సొంతంగా మౌలిక సామర్థ్యాలను నెలకొల్పాల్సిన అవసరం ఉందని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ పిలుపునిచ్చారు. రాబోయే దశాబ్దాల్లో భౌగోళిక రాజకీయ శక్తిగా ఎదగాలంటే ఇంధన భద్రత, డిజిటల్ ఇన్‌ఫ్రాలే కీలకమని ఆయన పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన వార్షిక వ్యాపార సదస్సు-2026లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయపరమైన విభజనల నేపథ్యంలో దశాబ్దాల నాటి గ్లోబలైజేషన్ భావనలకు కాలం చెల్లుతోందన్నారు.


## సత్యదేవుని సన్నిధిలో..
# దళారీ దందా.. అధికారుల నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

"స్వామివారి హుండీ ఆదాయం తగ్గిపోతుంటే, కొందరి జేబులు మాత్రం నిండుతున్నాయి" అంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హుండీ, వ్రత మండపాలు, కాటేజీలు, షాపుల ద్వారా భారీ ఆదాయం వచ్చినప్పటికీ, ఆ నిధులు పూర్తిగా సిబ్బంది జీతాలు మరియు నిర్వహణ ఖర్చులకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దేవస్థానం ఆదాయాన్ని పెంచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హిందూ సంఘాలు విమర్శిస్తున్నాయి. దేవస్థానం పరిసరాల్లో దళారుల కార్యకలాపాలు పెరిగిపోయాయని భక్తులు ఆరోపిస్తున్నారు. "ప్రత్యేక దర్శనం ఇప్పిస్తాం... ఒక్కొక్కరికి రూ.500 ఇస్తే నేరుగా స్వామివారి దర్శనానికి తీసుకెళ్తాం" అంటూ అమాయక భక్తులను మోసం చేస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా పడమటి రాజగోపురం పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ఈ వ్యవహారాలు ఎక్కువగా జరుగుతున్నాయని సమాచారం. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సి వస్తుండగా, డబ్బులు తీసుకుని కొందరిని నేరుగా దర్శనానికి తీసుకెళ్తున్నారనే ఆరోపణలు భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయి. కొంతమంది దళారులు రోజుకు నిర్దిష్ట మొత్తాలు చెల్లిస్తూ, కొందరు సిబ్బంది సహకారంతో ఈ వ్యవస్థను కొనసాగిస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అన్నవరం దేవస్థానంలో జరుగుతున్న లోపాలపై పలువురు అధికారులు దేవాదాయశాఖకు, రాష్ట్రప్రభుత్వ ఉన్నత వర్గాలకు ఫిర్యాదులు కూడా చేశారు.

**మొబైల్ ఫోన్ల ద్వారానే ప్రోటోకాల్ సెట్టింగులు**

దేవస్థానంలో డ్యూటీలో ఉన్న సిబ్బంది మొబైల్ ఫోన్ల వినియోగంపై కూడా భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొబైల్ ఫోన్ల ద్వారానే ప్రోటోకాల్ సెట్టింగులు, ఇన్‌సైడ్ సమాచారం, దళారీ వ్యవస్థ సులభంగా కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఈఓ


Dt 22/02/2026
NAME:- Bagadi. Ramakrishna
Place Tekkali
District Srikakulam

తనిఖీల సమాచారం ముందుగానే కొందరికి చేరుతుండటంతో, అప్పటి వరకు విధుల్లో కనిపించని సిబ్బంది ఒక్కసారిగా డ్యూటీ ప్రాంతాల్లో ప్రత్యక్షమవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. "సామాన్య భక్తుడు మొబైల్ ఫోన్ తీసుకెళ్తే జరిమానా విధిస్తారు. కానీ అధికారులు, సిబ్బంది మాత్రం ఫోన్లతో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. సత్యదేవుని సన్నిధిలో కూడా భక్తుడికి ఒక న్యాయం, అధికారులకు మరో న్యాయమా?" అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**భద్రతా వ్యవస్థ పనితీరుపైనా తీవ్ర విమర్శలు**

దేవస్థానం భద్రతా వ్యవస్థ పనితీరుపైనా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన ఆలయ మార్గాల్లో సరైన తనిఖీలు జరగడం లేదని, భద్రతా ప్రమాణాలు సడలిపోయాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా సుమారు రూ.92 లక్షలు సెక్యూరిటీ విభాగంపై ఖర్చు చేస్తున్నప్పటికీ, భక్తులకు కనిపించే స్థాయిలో భద్రతా వ్యవస్థ పనిచేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. "స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు భారీ వేతనం చెల్లిస్తున్నప్పటికీ, ప్రధాన మార్గాల్లో కఠిన తనిఖీలు ఎందుకు జరగడం లేదు?" అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇక దేవస్థానంలోని కొందరు అధికారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే చర్చలు కూడా సిబ్బంది వర్గాల్లో వినిపిస్తున్నాయని సమాచారం. ఆరోపణలు వచ్చినప్పటికీ, వారి మీద చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని విజిలెన్స్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని భక్తులు, హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, "సత్యదేవుని ఆలయంలోనే అక్రమాలు, రాజకీయ ప్రభావం, దళారీ వ్యవస్థ కొనసాగితే భక్తుల విశ్వాసం దెబ్బతింటుంది. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండాలి గానీ దందాల కేంద్రాలుగా మారకూడదు" అని హెచ్చరిస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు మరియు హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**భక్తుల ప్రధాన డిమాండ్లు:**

దేవస్థానం వ్యవహారాలపై హై లెవెల్ విజిలెన్స్ విచారణ
దళారీ వ్యవస్థపై క్రిమినల్ కేసులు
డ్యూటీలో మొబైల్ ఫోన్లపై పూర్తి నిషేధం
సెక్యూరిటీ వ్యవస్థపై ప్రత్యేక ఆడిట్
ప్రధాన ఆలయ మార్గాల్లో కఠిన తనిఖీలు
పడమటి రాజగోపురం, పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా
సీసీటీవీ ఆధారంగా అధికారుల విధుల పర్యవేక్షణ
ప్రోటోకాల్ దర్శనాలకు అధికారిక లెటర్ విధానం
రాజకీయ అండదండలపై విచారణ
తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం దేవస్థానం తరహాలో పారదర్శక విధానాల అమలు

# జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇండ్ల సెకండ్ ఫేజ్

**హైదరాబాద్, మహా :** పేదల సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' రెండో విడతను లాంఛనంగా ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ. పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో ఇప్పటికే సొంత స్థలాలు ఉండి, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులకు ఈ నెల చివరి నాటికి మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అలాగే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం యుద్ధ ప్రాతిపదికన 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించాలని సూచించారు. కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించిన తర్వాతే లబ్ధిదారులను గృహ ప్రవేశం చేయించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదన్నారు. మల్కాజిగిరిలో నిబంధనలకు విరుద్ధంగా యూఎల్సీ భూముల రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై తక్షణ చర్యలకు ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు వివాదాలను పరిష్కరించేందుకు రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలించి వెంటనే రశీదులు ఇవ్వాలి
- స్థానిక హమాలీలను పూర్తి స్థాయిలో వినియోగించాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులు





**మహా వరంగల్ బ్యూరో;** మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్, తో కలిసి అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

**ఈ వీడియో కాన్ఫరెన్స్ లో**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సూచించారు. అవసరమైతే జిల్లాలోని ప్రైవేట్ గోదాములను కూడా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ధాన్యం నిల్వల సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలని ఆదేశించారు. జిల్లాల్లో స్థానిక హమాలీలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులు రద్దు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ కొనుగోళ్ల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, మాట్లాడుతూ ఈసారి మొక్కజొన్న దిగుబడి భారీగా వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ.3,873 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వర్షాల సూచనలను దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంబంధిత అధికారులతో సమావేశమై, మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై సమీక్షించారు. అలాగే ప్రభుత్వం ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి, రవాణా, గన్నీ సంచులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్య రాణి, రవి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డీసీఎస్ఓ వాజిద్ అలీ, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సింగ్, డీసీఓ సంజీవ్‌రెడ్డి, డీఎం సివిల్ సప్లై మహేందర్, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, ఎం.వి ఐ వేణుగోపాల్, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం రాజేంద్ర ప్రసాద్, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఆర్డీఓ నాగపద్మజ, డీసీఓ నీరజ , అగ్రికల్చర్ అధికారి, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం విజయ నిర్మల డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఎం వి ఐ శోభన్ బాబు, లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలాదేవి సందర్శించారు. మొదట ఆలయానికి విచ్చేసిన తిరుమలా దేవికి ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మయూరి రామేశ్వరరావు, సిరిపోలు శ్రీధరరావు ఆలయ ప్రధానార్ధకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షకులు విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా హనుమాన్ జన్మోత్సవం

దేవాలయములో ఈ రోజు హనుమాన్ జన్మోత్సవం వైభవంగా నిర్వహించబడినది. భద్రకాళి దేవాలయ దత్తత దేవాలయమైన శ్రీ చెరువులో ఆంజనేయస్వామి దేవాలయములో హనుమాన్ జయంతి ఉత్సవములు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అభిషేకములు నిర్వహించిన తదుపరి హోమము నిర్వహించి అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నగర సేవలు మరింత మెరుగుపడాలి

- ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు
- పారిశుధ్య నిర్వహణలో రాజీలేదు
- కలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్




**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నగర సేవలు మరింత మెరుగుపడాలని హన్మకొండ జిల్లాకలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిడబ్లుఎంసి ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుద్ధ్యం, ప్రజా సేవలు, ఆదాయ వనరుల బలోపేతం, వ్యర్థాల నిర్వహణ, వాహనాల వినియోగం, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై కలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సంబంధిత జీడబ్ల్యూఎంసీ వింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నగరంలో వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాన రహదారులపై సంచరించే వీధి పశువులను వెంటనే గోశాలలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోల పంపిణీ, వాటి సమర్థ వినియోగం, ఫ్యూయల్ బంక్ నిర్వహణ, వాహనాల విభజన, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ అంశాలపై సమీక్షించారు. ఫ్యూయల్ బంక్ హ్యాండింగ్ ఓవర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన చోట కార్మికుల భర్తీ చేపట్టాలని సూచించారు. ఎఫ్ఎస్‌టీపీ నిర్వహణ పక్కాగా జరగాలని, డీస్లడ్జింగ్ ఆపరేటర్లు సేకరించిన మలినాలను ఎఫ్ఎస్‌టీపీ లోనే డంప్ చేసేలా కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సి అండ్ డి వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల పురోగతి, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ వసూళ్ల పై సమీక్షించి ఆదాయ వనరులను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోర్టల్ అసెస్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి నగర ర్యాంకింగ్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతులు చేసిన వాహనాల వినియోగ స్థితి, బయోమైనింగ్ పనుల పురోగతి, అక్రమ హోర్డింగ్స్ సర్వే, జీఐఎస్ సర్వే ప్రతిపాదనలు, స్వీపింగ్ యంత్రాల రోజువారీ పనితీరు అంశాలపై సమగ్రంగా చర్చించారు. పార్కుల నిర్వహణను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా కొత్త పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీ పెంపక కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వసూలు చేయలేని ఆస్తి పన్నుల డిమాండ్ల పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్న కలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ నగరాభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డిఎంహెచ్వో

- వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన చికిత్సను అందించాలి
- వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు




**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రలు సంగెం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ మొండ్రాయి, రాయపర్తి (డబ్ల్యూ) పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను కొత్తూరులోనూ పర్యటించారు. కొత్తగా నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ రికార్డులను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు అందించవలసిన సేవలపై నిర్దేశించిన సమయానుకూలంగా నిర్వహించి వ్యాక్సిన్ 100 శాతం పూర్తి చేయాలని కోరారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అందించవలసిన సేవల పైన అవగాహన కల్పించి పరీక్షలు చికిత్సలు చేయాలని కోరినారు. ఎండాకాలంలో అధిక వేడి ఉన్నందువలన వడదెబ్బ సంభవించే ప్రమాదం ఎక్కువగా చిన్నపిల్లలకు గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు ఎక్కువ ఉద్భవించే అవకాశం ఉంటుందని వారికి వడదెబ్బ గురించి తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. ఈ సమయములో ప్రజలు ఎవరైనా వారి వారి పనుల నిమిత్తం ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే బయటికి వెళ్లాలని సూచించారు. పని ఉన్నట్లయితే తలకు రుమాలు టోపీ గొడుగు మొదలగు వాటిని ధరించి సన్ స్ట్రోకు గురికాకుండా కాపాడాలని కోరారు. సన్ స్ట్రోక్ గురి అయిన వెంటనే వారికి వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సరియైన చికిత్సలు అందించడం జరుగుతుందని ప్రజలు కూడా ముందుగా ఇంటిలో ఉన్న ఓఆర్ఎస్ ద్రావణం కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువ మోతాదులో తీసుకోవాలని కోరినారు. ఈ సమయంలో చర్మవ్యాధులు వ్యాప్తి చెంది అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి చర్మ సంబంధిత ఏ సమస్యలు ఉన్న ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా తగిన చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ఆశ కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు ఉద్యోగ సమయ ధర్మాన్ని పాటించి ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించాలని ఎవరైనా అతిక్రమిస్తే వారిపైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యాధికారులు సీసీ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు

# టీజీ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు

**మహా వరంగల్ బ్యూరో ;** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేట ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికవిద్యా వారోత్సవాల కార్యక్రమంలో" భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం తోపాటు కళాశాల అభివృద్ధి కోసం రూ.100 000 రూ.10 000 నగదు ప్రోత్సాహక చెక్కును అందజేయడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తన వ్యక్తిగత విజయమే కాకుండా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ కళాశాల కూడా సంకల్పం, క్రమశిక్షణ, సమిష్టికృషి ఉంటే రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థగా నిలవగలదని మేము నిరూపించామని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం మా బాధ్యత మాత్రమే కాదు, అది మా లక్ష్యం. ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగునింపే విద్యా దీపంగా కళాశాలను నిలుపుతానని, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, సాంకేతిక వనరులు, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల కలలను నిజం చేయడం కోసం అధ్యాపక బృందంతో కలిసి మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేటను తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా నిలబెట్టడం నా కల. విద్య, విలువలు, విజన్ ఈ మూడు అంశాల ఆధారంగా కళాశాలను అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతూ ప్రతి తరగతి గది ఒక స్ఫూర్తి కేంద్రంగా, ప్రతి విద్యార్థి ఒక నాయకుడిగా ఎదగాలి అని పోటీ పరీక్షల శిక్షణ, డిజిటల్ లెర్నింగ్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లి తండ్రులు, విద్యార్థులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# మెగా టెక్స్టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు




- 1800 స్టిచ్చింగ్ పోస్టుల భర్తీ పై సమీక్ష
- టైలరింగ్ పై పట్టు ఉన్న మహిళలకు ప్రాధాన్యత
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులోని కిటెక్స్ కంపెనీలో 1800 స్టిచ్చింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టైలరింగ్ పై పట్టు ఉన్న మహిళలు, నేర్చుకోవాలా ఉత్సాహం ఉన్న మహిళలకు ఉచిత శిక్షణా ఇవ్వడం జరిగిందని, స్థానిక యువతకు అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నియామక ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డి ఆర్ డి ఎ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, నెప్మా - నాబార్డ్ ఎంప్లాయ్‌మెంట్ ద్వారా ఈ రిక్రూట్మెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఉద్యోగాలకు నెలకు రూ.12,300 నుంచి రూ.21,800 వరకు వేతనం నిర్ణయించినట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు ఈ టైలరింగ్ ఉద్యోగాలు మంచి జీవనోపాధి అవకాశాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వరంగల్ ప్రజలకు ముందు ప్రాధాన్యతా ఇవ్వడం జరుగునని, అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందేలా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ద్వారా వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని, స్థానిక యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై.వి. గణేష్, జిఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి రాంరెడ్డి, డీఆర్డీఓ నాగపద్మజ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సాత్విక, జోనల్ ఆఫీసర్ స్వామి, కిటెక్స్ హెచ్ఆర్ శరత్, ఎస్ఎస్‌జీ సభ్యులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథికి ఘన స్వాగతం పలికిన డిసిసి అధ్యక్షులు

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథి మహేష్ కుమార్ గౌడ్ పరకాల నియోజకవర్గం ముస్తాల పెల్లి గ్రామంలో ఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా వరంగల్, హన్మకొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, ఇనగాల వెంకట్రాం రెడ్డి ఆయనకు గజమాలతో ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, ఆరెల్లి రవి, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నాయకుడు అయిత క్రాంతి, ముఖ్య నాయకులు తోపాటు మండలాధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలి

- డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్
- ఇంటర్ స్క్వాడ్ బృందాలకు కీలక ఆదేశాలు




**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో 13 వ తేదీ నుండి నిర్వహించబోయే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఆదేశించారు. మంగళవారం నాడు ఇంటర్ విద్య కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల 16 సప్లమెంటరీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడుతాయని అన్నారు. సప్లమెంటరీ పరీక్షలకు గాను అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో డ్యుయల్ డెస్కులు, గాలి, నీరు, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతుల తోపాటు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు, ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల స్టోరేజ్, కార్యాలయ విధులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలియజేసారు. పరీక్షల పర్యవేక్షణకు గాను జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 16 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 16 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. 16 పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది మరియు బందోబస్తుకు సైతం ఏర్పాట్లు చేయనైనది. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు మాధవరావు, శారద, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు ఓ వరం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- లబ్ధిదారులకు రూ.6 లక్షల 33 వేల చెక్కులు అందజేత



**మహా వరంగల్ బ్యూరో;** సీఎం సహాయనిధి పేదలకు ఓ వరం అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 33 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు. అర్హులైన వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ పేర్కొన్నారు. ప్రతి అర్హుడూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# జిల్లాలో శర వేగంగా రబీ ధాన్యం కొనుగోళ్లు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో రబీ 2025 26 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు శర వేగంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లాలో మొత్తం 1,93,809 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతుల నుండి 22,456 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 20,006 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు 1,450 మంది రైతులకు రూ.19.90 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, లోడింగ్, రవాణా ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని, రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

# భారత రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు

- వరంగల్ జిల్లా నుంచి ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**మహా వరంగల్ బ్యూరో ;** భారత రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ప్రారంభించారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ గా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) వై వి గణేశ్ నియమించగా నోడల్ అధికారి గా డిప్యూటీ కమిషనర్ లేబర్ ను, కలెక్టర్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ సత్య శారద నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ (క్రిమినల్ కేసులు లేనివారు) రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని పొందవచ్చని తెలిపారు. సభ్యత్వం పొందదలచిన వారు సభ్యత్వ దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేసి, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు ప్రతితో పాటు శాశ్వత సభ్యత్వ ఫీజు రూ.1,100/ చెల్లించాలని సూచించారు. సభ్యత్వం పొందిన వారికి శాశ్వత సభ్యత్వ కార్డు అందజేయబడుతుందని తెలిపారు. ఇప్పటికే సభ్యత్వం పొందిన సభ్యులు తమ వ్యక్తిగత వివరాలలో మార్పులు ఉన్నట్లయితే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొబైల్ నంబర్, చిరునామా మార్పులు, ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు మారదలచిన సభ్యుల ట్రాన్స్‌ఫర్ వివరాలను నవీకరించుకోవాలని తెలిపారు. సభ్యుల వివరాలను సకాలంలో నవీకరించుకోవడం ద్వారా భవిష్యత్తులో నిర్వహించే సభ్యత్వ కార్యక్రమాలలో సమర్థవంతంగా భాగస్వామ్యం కావచ్చని, అత్యవసర పరిస్థితుల్లో అర్హతగల సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న విష్ణు వర్ధన్ రెడ్డి

**మహా వరంగల్ బ్యూరో ;** హనుమాన్ జయంతి సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకలకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా 49 వ డివిజన్లోని ఇందిరమ్మ కాలనీలో గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 62 వ డివిజన్ విష్ణుపురి శ్రీ శ్వేతార్క గణపతి స్వామి ఆలయం తో పాటు సోమిడిలోని హనుమాన్ మందిరంలో లో ఘనంగా నిర్వహించిన హనుమాన్ జయంతిని వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం 7 వ డివిజన్ పద్మాక్షమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదనంతరం 30వ డివిజన్ పరిధిలో గల ఏకశిలా పార్క్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమన్ని ప్రారంభించారు అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | బుధవారం, హైదరాబాద్ | 13-05-2026
ANN తెలుగు

# తమిళనాట విచిత్ర రాజకీయాలు

తమిళనాడు అసెంబ్లీలో ఇప్పుడు ఆవిష్కృతమవుతున్న దృశ్యం ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత విచిత్రమైనది. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న టీవీకే , ప్రధాన ప్రతిపక్ష స్థానంలో ఉన్న డీఎంకే , అలాగే మూడో స్థానంలో ఉన్న అన్నా డీఎంకే.. ఈ పార్టీల జెండాలు, రంగులు వేరైనా వాటి రక్తంలో ప్రవహిస్తున్న సైద్ధాంతిక డీఎన్ఏ మాత్రం నూటికి నూరు శాతం ఒక్కటే!.పెరియార్ ఆశయాలు, సామాజిక న్యాయం, లౌకికవాదం, హిందీ వ్యతిరేకత అనే ఒకే సైద్ధాంతిక పునాదిగా పుట్టిన పార్టీలే నేడు అధికార, ప్రతిపక్ష స్థానాలను పంచుకున్నాయి.దానికి తోడు, ఎన్నికల ముందు వరకూ డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, ముస్లిం లీగ్ సైతం ఇప్పుడు అవకాశవాదంతో అధికార టీవీకే ప్రభుత్వంలోకి చేరిపోయాయి.మరి పాలకుల సిద్ధాంతం, ప్రతిపక్షం సిద్ధాంతం, మద్దతుదారుల సిద్ధాంతం అన్నీ "ఒకటే" అయినప్పుడు.. ప్రభుత్వ లోపాలను సైద్ధాంతికంగా ఎండగట్టేదెవరు? విభిన్నమైన, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచేదెవరు? ముఖాలు మారాయి కానీ భావజాలం మారని ఈ "అడ్జస్ట్‌మెంట్ రాజకీయాల" చదరంగంలో..*"అసలు నిజమైన ప్రతిపక్షం ఎక్కడ?"*అన్నది ఇప్పుడు తమిళనాట చర్చ.



ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అనేవి ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపాలు. నాయకులు చెప్పే సిద్ధాంతాలు, వారు ఇచ్చే హామీలను నమ్మి ఓటరు తన తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేస్తాడు. కానీ, తీర్పు వెలువడిన తర్వాత ఆ సిద్ధాంతాలు గాలిలో కలిసిపోయి, కేవలం 'అధికారం' మాత్రమే పరమావధిగా మారితే? సరిగ్గా ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో ఇదే జరుగుతోంది. 2026 శాసనసభ ఎన్నికలు రాజకీయ అవకాశవాదానికి, అడ్జస్ట్‌మెంట్ పాలిటిక్స్‌కు పరాకాష్ఠగా నిలిచాయి. "మార్పు" అనే నినాదంతో వచ్చిన కొత్త శక్తి, అధికారం కోసం పాత కూటములతో చేతులు కలపడం, నిన్నటి బద్ధ శత్రువులు నేటి మిత్రులుగా మారడం తీవ్ర విమర్శలకు తావిచ్చే అంశంగా మారింది.

ఎన్నికలకు ముందు తమిళనాడులో ప్రధానంగా మూడు పక్షాలు పోరాడాయి. దశాబ్దాల ద్రావిడ పాలనకు, అవినీతికి వ్యతిరేకంగా తాము స్వచ్ఛమైన ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటూ విజయ్ నేతృత్వంలోని టీవీకే ఒంటరిగా బరిలోకి దిగింది. మరోవైపు డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (SPA)లో కాంగ్రెస్, వామపక్షాలు , ముస్లిం లీగ్ తదితర పార్టీలు కలిసి పోటీ చేశాయి.ఎవరి సిద్ధాంతాలు వారివి, ఎవరి నినాదాలు వారివి అన్నట్టుగా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజల ముందుకు వెళ్లారు.

ఫలితాలు రాగానే ఏ ఒక్క పార్టీకి 118 సీట్ల మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో (టీవీకే కి 108 సీట్లు రావడం) అసలు నాటకం మొదలైంది.డీఎంకే కూటమిలో ఉండి, ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎం.కే. స్టాలిన్ బొమ్మతో ఓట్లు అడిగిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే , ఐయూఎంఎల్ పార్టీలు.. ఎన్నికల తర్వాత ఏమాత్రం సంకోచం లేకుండా అధికార టీవీకే వైపు జంప్ చేశాయి.దశాబ్దాల నాటి డీఎంకే కూటమిని పక్కనపెట్టి, కేవలం అధికారంలో భాగస్వామ్యం కోసం చేసిన అవకాశవాద రాజకీయమే ఇదని విశ్లేషకులు ముక్తకంఠంతో విమర్శిస్తున్నారు. ఇక్కడ అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే సిద్ధాంతాల వైరుధ్యం. టీవీకే, వామపక్షాలు, కాంగ్రెస్ తమను తాము కరుడుగట్టిన లౌకికవాద పార్టీలుగా చెప్పుకుంటాయి. కానీ ఇప్పుడు వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మద్దతు తీసుకున్న పార్టీలలో 'ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్' కూడా ఉంది.ఈ పార్టీ ప్రాథమికంగా ముస్లిం కమ్యూనిటీ ప్రయోజనాల రక్షణ, ఇస్లామిక్ ప్రజాస్వామ్యం అనే మతపరమైన పునాదుల మీద నడుస్తుంది. మతతత్వ పార్టీలకు దూరంగా ఉంటామని బహిరంగంగా ప్రకటించే లౌకిక పార్టీలు, తీరా అధికారం కోసం ఒక మతం పేరుతో ఉన్న పార్టీతో జట్టు కట్టడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది.

విజయ్ తన ఎన్నికల ప్రచారంలో డీఎంకేను తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ నిశితంగా పరిశీలిస్తే, అధికారంలో ఉన్న టీవీకే , ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే మూల సిద్ధాంతాలు దాదాపు ఒకటే.సామాజిక న్యాయం, లౌకికవాదం, ద్విభాషా విధానం, రాష్ట్ర స్వయంప్రతిపత్తి.. ఇవే రెండు పార్టీల ప్రధాన అజెండాలు. కేవలం "కుటుంబ పాలన, అవినీతి" అనే ముద్రను డీఎంకే పై వేసి టీవీకే అధికారంలోకి వచ్చింది తప్ప, సైద్ధాంతికంగా ఈ రెండు పార్టీల మధ్య ఎలాంటి వైరుధ్యం లేదు. ఇక మూడవ స్థానంలో ఉన్న అన్నా డీఎంకే కూడా ఇదే తరహా మృదువైన ద్రావిడవాదాన్ని నమ్ముతుంది. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీకి పూర్తి భిన్నమైన సిద్ధాంతాలు, ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక విధానాలు ఉన్న పార్టీ ప్రతిపక్షంలో ఉంటేనే చట్టసభల్లో అర్థవంతమైన చర్చ జరుగుతుంది. కానీ తమిళనాడులో ఇప్పుడు అధికార పార్టీ (TVK), ప్రధాన ప్రతిపక్ష పార్టీ రెండూ ఒకే చెట్టు కొమ్మల్లాగా పెరియార్, అంబేద్కర్, కామరాజర్ సిద్ధాంతాలనే నమ్ముతున్నాయి.దీనికి తోడు డీఎంకే పాత మిత్రులే ఇప్పుడు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపే సైద్ధాంతిక ప్రతిపక్షం అసెంబ్లీలో కరువైందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

తమిళనాడు ప్రజలు దశాబ్దాల ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి విసిగిపోయి, ఒక స్వచ్ఛమైన మార్పు కోసం టీవీకే కి అఖండమైన మద్దతు ఇచ్చారు. పాత రాజకీయాలు, పాత కూటములు వద్దు అనుకున్నారు. కానీ విజయ్ ముఖ్యమంత్రి అవ్వడానికి మళ్లీ అదే పాత డీఎంకే కూటమిలోని పార్టీల (కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ముస్లిం లీగ్) మద్దతు తీసుకోవాల్సి వచ్చింది.అంటే ప్రజలు ఏ రాజకీయ పక్షాలను అయితే తిరస్కరించారో, మళ్లీ వారే టీవీకే వెనుక ఉండి ప్రభుత్వాన్ని శాసిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఒకరినొకరు తిట్టుకోవడం, ఎన్నికల తర్వాత అధికారం కోసం తెరవెనుక ఒప్పందాలు చేసుకోవడాన్నే రాజకీయ పరిభాషలో "అడ్జస్ట్‌మెంట్ పాలిటిక్స్" అంటారు. తమిళనాడులో ఇప్పుడు స్పష్టమైన మెజారిటీ ఏ ఒక్కరికీ రాకపోవడంతో, నిన్నటిదాకా శత్రువుల్లా ఉన్నవారు నేడు మిత్రులుగా మారిపోయారు. అధికారం చేజారిపోకుండా చూసుకోవడానికి పార్టీలు తమ మూల సిద్ధాంతాలను గాలికొదిలేసి, పదవుల కోసం రాజీపడ్డాయి. ఈ తెరవెనుక రాజకీయాలు ఓటరును తీవ్ర నైరాశ్యానికి గురిచేస్తున్నాయి. పార్టీల ఈ ఊసరవెల్లి రాజకీయాలు అంతిమంగా ప్రజలను నిలువునా వంచించడమే అవుతుంది. ఒక కూటమి పేరుతో ఓట్లు అడిగి గెలిచిన ఎమ్మెల్యేలు, ఫలితాల తర్వాత రాత్రికి రాత్రే అవకాశవాదంతో మరో పార్టీకి మద్దతు తెలపడం నైతికంగా ఎంతవరకు సబబు? సైద్ధాంతిక పవిత్రత గురించి గొప్పగా మాట్లాడే నాయకులు, అధికారం కోసం ఏమైనా చేస్తారని 2026 ఎన్నికలు రుజువు చేశాయి. ఎన్నికల ముందు విడిగా ఉండి.. తర్వాత అంతా ఒక్కటే అని చేతులు కలపడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అపహాస్యం చేయడమే అని సగటు ఓటరు ఆవేదన చెందుతున్నాడు.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్ ఖమ్మం

# విద్యా వ్యవస్థపై లీకేజీల దాడి




దేశ విద్యావ్యవస్థ నడిబొడ్డున పేలిన 'నీట్' బాంబు యావత్ జాతిని నిలువునా దహించివేస్తోంది. కళ్లు కాయలు కాసేలా చదివిన 22 లక్షల మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశల గొంతును లీకేజీ రాబందులు అత్యంత కిరాతకంగా నులిమేశాయి. అహర్నిశలు శ్రమించిన అభాగ్యుల భవితను బలిపీఠం ఎక్కించి, దళారుల జేబులు నింపిన ఈ మహా కుంభకోణం విద్యావ్యవస్థకే పట్టిన అతిపెద్ద పీడకల. ప్రాణాలు పోసే పవిత్రమైన వైద్య వృత్తిని, కాసుల కోసం అంగట్లో సరుకులా మార్చేసిన మాఫియా మృగాల దాహానికి నిలువునా బలైంది విద్యార్థుల పవిత్రమైన కలలు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఈ చీకటి దందాపై సర్వత్రా ఆగ్రహజ్వాలలు రగులుకుంటున్నాయి.తప్పును కప్పిపుచ్చుకోలేక, విద్యార్థుల కన్నీటి సెగలకు ఉక్కిరిబిక్కిరైన కేంద్ర ప్రభుత్వం.. ఎట్టకేలకు దిగివచ్చి పరీక్షను రద్దు చేయడంతో పాటు, ఈ పాపానికి కారణమైన గద్దల రెక్కలు విరిచేందుకు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. అత్యంత ప్రతిష్ఠాత్మక వైద్య విద్యా ప్రవేశ పరీక్ష 'నీట్‌యూజీ 2026' పవిత్రత మంటగలిసింది. ప్రశ్నాపత్రం లీకేజీ, పరీక్ష నిర్వహణలో భారీ అవకతవకలు జరిగాయన్న పక్కా ఆధారాలు లభించడంతో దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఏళ్ల తరబడి అహర్నిశలు శ్రమించి చదివిన దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థుల ఆశలపై లీకేజీ మాఫియా నీళ్లు చల్లింది. వ్యవస్థపై నమ్మకం సడలకుండా, విద్యార్థులకు న్యాయం చేసే దిశగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించింది. కేంద్ర నిఘా, పోలీసు వర్గాల నుంచి అందిన ప్రాథమిక నివేదికల ఆధారంగా ఈ మహా కుంభకోణంపై సీబీఐ విచారణకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

లీకేజీ వ్యవహారంపై రాజస్థాన్ పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. దేశంలోనే అతిపెద్ద కోచింగ్ హబ్ అయిన రాజస్థాన్‌లోని 'కోటా' కేంద్రంగా ఈ లీకేజీ దందా సాగినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. పరీక్షకు ఏకంగా 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సికార్‌లో వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రశ్నాపత్రం చక్కర్లు కొట్టినట్లు నిర్ధారణ అయింది. కోటాలోని కొన్ని కోచింగ్ సెంటర్లు విద్యార్థులకు పంపిణీ చేసిన మెటీరియల్‌లో.. అసలు ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు యథాతథంగా ప్రత్యక్షం కావడం దర్యాప్తు అధికారులను సైతం నివ్వెరపరిచింది. ముఖ్యంగా కెమిస్ట్రీ విభాగంలో 120కి పైగా ప్రశ్నలు ఆ మెటీరియల్‌లో అచ్చుగుద్దినట్లు ఉన్నాయని రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ లీకైన ప్రశ్నాపత్రాన్ని మాఫియా ముఠాలు రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు బహిరంగంగా విక్రయించాయి. కొందరి వద్ద ఏకంగా రూ.30 వేలకు పైగా అడ్వాన్స్‌లు వసూలు చేసిన బాగోతం వెలుగులోకి రావడంతో పోలీసులు ఇప్పటికే పలువురు కీలక అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో కలిపి 5,400కు పైగా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షను నమ్ముకుని దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర ఆందోళనలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎన్టీఏ కాస్త ఊరటనిచ్చే ప్రకటన చేసింది. గతంలో చెల్లించిన పరీక్ష ఫీజు మొత్తాన్ని విద్యార్థులకు రీఫండ్ చేయనున్నట్లు వెల్లడించింది. మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, సంస్థ సొంత నిధులతోనే పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తుందని స్పష్టం చేసింది. త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా కొత్త తేదీలు, అడ్మిట్ కార్డుల వివరాలను ప్రకటిస్తామని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సీబీఐ విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని ఎన్టీఏ వర్గాలు స్పష్టం చేశాయి. పారదర్శకతే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని ప్రకటించాయి.

- మహా డెస్క్

## జ్ఞానుల్లో సందేహం..
# మూర్ఖుల్లో నమ్మకం
## ప్రపంచ వినాశనానికి కారణం ఇదేనా?

మూర్ఖులు, ఛాందసవాదులు తమ అభిప్రాయాలపై అమితమైన విశ్వాసంతో ఉంటే, మేధావులు మాత్రం నిరంతరం సందేహంలోనే మునిగిపోతుంటారు. రస్సెల్ చెప్పిన ఈ పచ్చి నిజం నేటి సోషల్ మీడియా కాలానికి ఎంతవరకు వర్తిస్తుందో వివరించే ప్రత్యేక విశ్లేషణ.
నేటి 'వాట్సాప్ యూనివర్సిటీ' కాలంలో, ప్రతి ఒక్కరూ తాము చెప్పిందే వేదమని వాదిస్తున్న తరుణంలో.. రస్సెల్ చెప్పిన ఈ 'సందేహవాదం' ఎంతో అవసరం. మేధావులు మౌనం వీడి, తమ సందేహాల నుంచే సరైన పరిష్కారాలను వెతకాలి.

**"ఈ ప్రపంచంలో ఉన్న అసలు సమస్య ఏమిటంటే.. తెలివి తక్కువ వారు, ఛాందసవాదులు ఎప్పుడూ తమపై తాము అమితమైన నమ్మకంతో ఉంటారు. కానీ, నిజమైన జ్ఞానులు మాత్రం ఎప్పుడూ సందేహాలతో సతమతమవుతుంటారు."**

**- బెర్ట్రాండ్ రస్సెల్**




ఇది ఏదో నిరాశావాదంతో అన్న మాట కాదు. 20వ శతాబ్దపు గొప్ప గణిత శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత అయిన రస్సెల్.. మానవ మేధస్సు, సమాజ పోకడలపై దశాబ్దాల పాటు పరిశోధన చేసి తేల్చిన చేదు నిజం. నేడు మనం చూస్తున్న రాజకీయాలు, సోషల్ మీడియా వాదనలు, సమాజంలోని అశాంతికి ఈ ఒక్క వాక్యం అద్దం పడుతోంది.

**ధీమా వెనుక దాగున్న అజ్ఞానం**

సాధారణంగా గట్టిగా మాట్లాడే వారిని, ఏ విషయంలోనైనా వెనకడుగు వేయని వారిని మనం 'నాయకులు' అని భ్రమపడుతుంటాం. కానీ, రస్సెల్ దృష్టిలో అది నాయకత్వ లక్షణం కాదు, ఒక ప్రమాదకరమైన బలహీనత. ఒక వ్యక్తికి ఒక అంశంపై అవగాహన ఎంత తక్కువగా ఉంటే, వారు అంత ధీమాగా ఉంటారు. దీన్నే ఆధునిక మనస్తత్వ శాస్త్రంలో కూడా మనం చూస్తుంటాం. క్లిష్టమైన సమస్యలను కూడా అతి సులువుగా పరిష్కరించేయవచ్చు అని మూర్ఖులు నమ్ముతారు. కానీ ఆ సమస్య వెనుక ఉన్న వేలాది కోణాలను చూసే జ్ఞాని మాత్రం.. "నేను తీసుకునే నిర్ణయం సరైనదేనా?" అని ఆలోచనలో పడతాడు. ఈ సందేహమే మేధావులను వెనక్కి నెడుతుంటే, ఎటువంటి ఆలోచన లేని ఛాందసవాదులు మాత్రం సమాజాన్ని తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. ఫలితంగా, ప్రపంచం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఏర్పడుతోంది.

**రస్సెల్ ఈ మాట ఎందుకు చెప్పాల్సి వచ్చింది?**

బెర్ట్రాండ్ రస్సెల్ బ్రిటన్‌కు చెందిన తత్వవేత్త. సామాజిక విశ్లేషకుడు. ఆయన రెండు ప్రపంచ యుద్ధాలను కళ్లారా చూశారు. నియంతల అహంకారం, తామే సరైనవారమనే అతివిశ్వాసం కోట్లాది మంది ప్రాణాలను ఎలా బలి తీసుకుందో గమనించారు. ఫాసిజం వంటి ప్రమాదకరమైన భావజాలాలు మేధావుల మౌనం వల్లే బలపడతాయని ఆయన హెచ్చరించారు. రస్సెల్ తన జీవితంలో ఎన్నోసార్లు తన పాత అభిప్రాయాలను మార్చుకున్నారు. కొత్త విషయాలు తెలిసినప్పుడు పాత ఆలోచనలను వదిలేయడమే నిజమైన జ్ఞానానికి సంకేతమని ఆయన నమ్మేవారు. కానీ సమాజం మాత్రం.. మాటే మార్చని మొండివాడిని నమ్ముతుంది, నిత్యం నేర్చుకుంటూ మారే జ్ఞానిని అనుమానిస్తుంది.

**తెలివితేటలు - ప్రేమ: పరిష్కారం ఇదేనా?**

రస్సెల్ మరో సందర్భంలో ఒక గొప్ప మాట చెప్పారు: "మంచి జీవితం అనేది ప్రేమతో ప్రేరణ పొంది, జ్ఞానంతో నడవాలి." జ్ఞానం ఉండి ప్రేమ లేకపోతే అది చల్లని క్రూరత్వానికి దారితీస్తుంది. ప్రేమ ఉండి జ్ఞానం లేకపోతే అది అమాయకమైన విధ్వంసానికి కారణమవుతుంది. ఈ రెండింటి కలయికే నేటి ప్రపంచానికి అవసరం. మేధావులు కేవలం సందేహించడమే కాకుండా, సరైన దిశలో కార్యోన్ముఖులు కావాల్సిన సమయం ఇది.

**మన జీవితానికి ఇది ఎలా వర్తిస్తుంది?**

అతి విశ్వాసాన్ని అనుమానించండి: మీ అభిప్రాయంపై మీకు అమితమైన నమ్మకం కలిగినప్పుడు, ఒక్కక్షణం ఆగి ఆలోచించండి. "నేను పొరపడుతున్నానా?" అని ప్రశ్నించుకోవడం జ్ఞానానికి మొదటి మెట్టు.

**నాయకులను ఎంచుకునేటప్పుడు జాగ్రత్త:**

ప్రతిదానికీ "నేను పరిష్కరిస్తా" అని అరచేతిలో వైకుంఠం చూపించే వారి కంటే, వాస్తవాలను, సవాళ్లను వివరించే వారిని నమ్మండి.

**సందేహం బలహీనత కాదు:**

మీరు ఒక విషయంపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారంటే, మీరు మేధోపరంగా ఆలోచిస్తున్నారని అర్థం. అయితే, ఆ సందేహమే మిమ్మల్ని స్తంభించిపోయేలా చేయకూడదు.

నేటి 'వాట్సాప్ యూనివర్సిటీ' కాలంలో, ప్రతి ఒక్కరూ తాము చెప్పిందే వేదమని వాదిస్తున్న తరుణంలో.. రస్సెల్ చెప్పిన ఈ 'సందేహవాదం' ఎంతో అవసరం. మేధావులు మౌనం వీడి, తమ సందేహాల నుంచే సరైన పరిష్కారాలను వెతకాలి.

## ఆంజనేయుడి నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన
# జీవిత పాఠాలు



హనుమంతుడు కేవలం ఒక పురాణ పురుషుడు మాత్రమే కాదు, నేటి కాలానికి కూడా సరిపోయే అద్భుతమైన మేనేజ్‌మెంట్ పాఠాలకు, వ్యక్తిత్వ వికాసానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన జీవితం నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు, జీవిత సత్యాలు ఇక్కడ ఉన్నాయి.

**అచంచలమైన భక్తి, అంకితభావం**

హనుమంతుడు రామకార్యం పట్ల చూపిన అంకితభావం అద్భుతం. లంకలో సీతమ్మను వెతకడం నుంచి, లక్ష్మణుడి ప్రాణ రక్షణ కోసం సంజీవని పర్వతాన్ని మోసుకురావడం వరకు ఆయన ఎక్కడా అలసట చెందలేదు.
మనం చేసే పని చిన్నదైనా, పెద్దదైనా దాని పట్ల పరిపూర్ణమైన అంకితభావంతో ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం.

**సమయస్ఫూర్తి, తెలివితేటలు**

సముద్రాన్ని దాటేటప్పుడు సురస అనే రాక్షసి ఎదురైనప్పుడు, హనుమంతుడు తన రూపం పెంచి, చివరగా చిన్నగా మారి ఆమె నోటిలోకి వెళ్లి బయటకు వస్తాడు. ఇక్కడ ఆయన బలాన్ని కాకుండా తెలివితేటలను ఉపయోగించాడు.
ప్రతి సమస్యను శక్తితోనే పరిష్కరించలేం. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మన వ్యూహాన్ని మార్చుకోవాలి. తెలివిగా వ్యవహరించాలి. అవతలివారిని కొన్నిసార్లు కన్ఫ్యూజ్ కూడా చేయాలి.

**వినయం - అసలైన ఆభరణం**

అపారమైన శక్తులు ఉన్నా, ఆంజనేయుడు ఎప్పుడూ తనను తాను కేవలం 'రామ సేవకుడి'గానే చెప్పుకున్నాడు. లంకలో రావణుడి ఎదుట నిలబడినప్పుడు కూడా ఆయన గర్వం ప్రదర్శించలేదు. మనకు ఎంతటి అధికారం, సంపద వచ్చినా వినయం వీడకూడదు. అహంకారం లేని చోటే జ్ఞానం వృద్ధి చెందుతుంది. అంతేకాదు అందరికీ మీరు నచ్చుతారు.

**కమ్యూనికేషన్ స్కిల్స్**

హనుమంతుడు సీతమ్మతో మాట్లాడినప్పుడు చాలా జాగ్రత్తగా పదాలను ఎంచుకుంటాడు. రామలక్ష్మణులను మొదటిసారి కలిసినప్పుడు ఆయన మాట్లాడిన తీరు చూసి రాముడు ముగ్ధుడై, "ఈయన గొప్ప వ్యాకరణ వేత్త" అని కొనియాడతాడు. ఎదుటివారి మనసు నొప్పించకుండా, స్పష్టంగా, మర్యాదగా మాట్లాడటం గొప్ప నాయకత్వ లక్షణం. ఇదే అందరినీ మీకు దగ్గరగా చేస్తుంది.

**నాయకత్వం**

వానర సైన్యంతో కలిసి పని చేసేటప్పుడు ఆయన అందరినీ ప్రోత్సహిస్తాడు. తాను గొప్పవాడినని కాకుండా, అందరినీ కలుపుకొని పోతాడు. అందరం కలిసి పనిచేస్తేనే ముందుకుసాగుతాం అని భరోసా ఇస్తాడు. ఒక గొప్ప విజయం వెనుక సమిష్టి కృషి ఉంటుంది. నలుగురిని కలుపుకొనిపోయేవారే నిజమైన నాయకులు అని హనుమంతుడి ద్వారా అర్థమవుతుంది.. హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవాల్సిన అతిపెద్ద సత్యం ఏమిటంటే.. నమ్మకం, ప్రయత్నం తోడైతే అసాధ్యం అంటూ ఏదీ లేదు. ఆయన తన శక్తులను ఇతరుల మేలు కోసం, ధర్మ రక్షణ కోసం ఉపయోగించాడు. మనం కూడా మన సామర్థ్యాన్ని సమాజ హితం కోసం ఉపయోగిస్తే మన జీవితం సార్థకమవుతుంది.

## సారంగపల్లిలో పోలీసుల కార్డెన్ సెర్చ్ తనిఖీలు




### సైబర్ నేరాలపై అవగాహన

**మందమర్రి, మహా :** సారంగపల్లిలో మందమర్రి పోలీసులు మంగళవారం గార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 35 వాహనాలు సీజ్ చేశారు. ముందుగా గ్రామంలో ప్రధాన కూడళ్లు, వీధుల్లో పోలీసులు నాకాబందీ నిర్వహించి వాహనాలను తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. బైకులు, ఆటోలను ఆపి వాటికి సంబంధించిన ఆర్.సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందమర్రి సిఐ పర్స రమేష్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు హితవు పలికారు. ప్రజలకు సైబర్ నేరాల నుండి ముప్పు ఉందని వివరించారు.మీకు లాటరీ తగిలిందని, మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అయ్యిందని వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని సూచించారు. మీ వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పవద్దని పేర్కొన్నారు.ఆన్‌లైన్ లింకులు, వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని చెప్పారు. వీటిని క్లిక్ చేయడం ద్వారా మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.గ్రామంలో అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని కోరారు. నేరస్తులను గుర్తించడంలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, దాన్ని ప్రజలు సామాజిక బాధ్యతగా గుర్తించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై గోపతి నరేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్,ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముస్తాబైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం...

- బుధవారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక దృష్టితో పనులు పూర్తి
- నెరవేరనున్న విద్యాకుసుమాల దశాబ్దాల కల...



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాల భవనం, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని నేడు ప్రారంభించుకొనుండడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. వేలాది విద్యార్థుల అక్షర కోవెల, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే నూతన విద్యాసౌధం ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యపు నీడలో నిలబడి... నేతల అసమర్థత నిదర్శనంగా నిలిచిన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంది. అద్దె భవనాలు, అరకొర వసతులు, షిఫ్ట్ పద్ధతి తరగతులతో ఏళ్ల పాటు సాగిన ఈ కళాశాల ప్రస్థానం ఇక సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఆచార్య వినోభాబావె నడయాడిన చోట సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఉన్నత విద్యాకేంద్రం ప్రారంభోత్సవం బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరిగనుంది.

**ఇన్నాళ్లూ అక్షరాలా ఆగిపోయిన అడుగు....**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో 2008లో కాంగ్రెస్ హయాంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయటం జరిగింది. నాటి నుంచి బీఆర్ఎస్ రెండు దఫాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసినా.... భవనం మంజూరుకు పదేళ్లు పట్టింది. గత 18ఏళ్లుగా సరైన భవనం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం పూట డిగ్రీ కళాశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎండలో వేచి చూడటం, సాయంత్రం వేళల్లో రవాణా సౌకర్యం లేక గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. 2017లో వినోభానగర్ లో నూతన భవన నిర్మాణానికి రూ.3.25కోట్లతో ప్రారంభోత్సవం చేసి, పదేళ్లుగా పనులు చేస్తూ వచ్చారు. అలా వదిలేసిన డిగ్రీ కళాశాల భవనానికి ఇక శాశ్వత పరిష్కారం లభించింది.

**ఎమ్మెల్యే మల్ రెడ్డి ప్రత్యేక చొరవతో సిద్ధమైన విద్యాకేంద్రం....**

విద్యతోనే వికాసం సాధ్యమని నమ్మే మన ప్రియతమ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి..... ఇబ్రహీంపట్నంలో షిఫ్ట్ ల వారీగా సాగుతున్న జూనియర్, డిగ్రీ తరగతులు, గ్రామీణ విద్యార్థుల కష్టాలు చూసి చలించిపోయారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులతో మాట్లాడి, పెండింగ్ లో ఉన్న నిధులను మంజూరు చేయించారు. అనంతరం, అన్నీతానే.... గుత్తేదారులను, అధికారులను పరుగులు పెట్టించి, నూతన భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేయించారు.

**ఇకపై ప్రకృతి ఒడిలో విద్యావికాసం....**

ఐదెకరాలలో రూపుదిద్దుకున్న ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం కార్పొరేట్ తరహాలో సకల సదుపాయాలతో సిద్ధమైంది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో 550మంది విద్యనభ్యసిస్తుండగా.... బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలలో 20మంది భోదన సిబ్బంది ఉండగా, నలుగురు గెస్ట్ ఫ్యాకల్టీ, మరో పది మంది వరకు భోదనేతర సిబ్బంది ఉన్నారు. చుట్టూ ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన గదులు, డిజిటల్ ల్యాబ్స్ మరియు క్రీడా ప్రాంగణంతో ప్రైవేటు సంస్థలకు దీటుగా రూపుదిద్దుకుంది. 12 తరగతి గదులు, 3 ల్యాబ్స్, ఎన్ సీసీ రూం, అధ్యాపకులకు హాల్, స్పోర్ట్స్ రూం, విద్యార్థినీవిద్యార్థులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశాలమైన క్రీడాప్రాంగణం, ఆకట్టుకునే గ్రీన్ ప్లాంటేషన్ తో అద్భుతంగా తీర్చిదిద్దారు. కళాశాలకు కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఎమ్మెల్ మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

**ఇది భవనం మాత్రమే కాదిది, ఆశల వారధి: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి....**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా తెలంగాణ భవితకు బంగారుబాటలు వేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేందుకు కృషిచేస్తున్నాం. ఇందులో భాగంగానే ఇన్నాళ్లు పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం పూర్తిచేశాం. కళాశాలలో అత్యున్నత విద్యనందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తాం. కార్పొరేట్ విద్య అంటూ లక్షల రూపాయలు వృథా చేసుకోకుండా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కళాశాల భవనం నేడు ప్రారంభించుకొనుండడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

## పశువుల అక్రమ రవాణా, అక్రమ ధాన్యం రవాణాను అరికట్టాలి

### బక్రీద్ పండగ నేపథ్యంలో అంతర్రాష్ట్ర పోలీస్ సమన్వయ సమావేశం




**మంచిర్యాల, మహా :** పశువుల అక్రమ రవాణా,అక్రమ ధాన్యం రవాణాను అరికట్టాలని రామగుండం సిపి అంబార్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. మంగళవారం జైపూర్ పోలీస్ స్టేషన్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహారాష్ట్ర, కొమురం భీమ్ ఆసిఫాబాద్ సరిహద్దు జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు హాజరై పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బక్రీద్ పండుగ సమయంలో ఆవుల అక్రమ రవాణా, మతపరమైన ఉద్రిక్తతలు,నేర సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు తెలిపారు.ఈ మేరకు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్రమంగా పశువుల రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, మహారాష్ట్ర వైపు నుంచి జరిగే పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అన్ని చెక్‌పోస్టులు, నాకాబందీలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సరిహద్దు ప్రాంతాల్లో నిర్వహించే పశువుల మార్కెట్లను తాత్కాలికంగా మూసివేయడంతో పాటు,అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు.అదే విధంగా అక్రమ పశువుల రవాణాకు సహకరిస్తున్న ప్రభావశీల వ్యక్తులు, మద్దతుదారులపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల రవాణాదారుల కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మహారాష్ట్ర వైపు నుంచి అక్రమ ధాన్యం (వడ్లు) రవాణా జరగకుండా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి రైతులను అప్రమత్తం చేయాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాలపై నిరంతర సమాచార మార్పిడి కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో చర్చించారు. నాకాబందీలు నిర్వహించే సమయంలో సంబంధిత సరిహద్దు పోలీస్ స్టేషన్లకు ముందస్తు సమాచారం అందించాలని నిర్ణయించారు. తెలంగాణ,మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పరస్పర సమాచార మార్పిడి, సమన్వయ చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,సిరోంచా ఎస్‌డీపీవో సందేశ్ నాయక్,జైపూర్ సర్కిల్ సీఐ కె. నవీన్ కుమార్,శ్రీరాంపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్,చెన్నూర్ రూరల్ సీఐ ఆర్. కృష్ణ, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, తాండూర్ సర్కిల్ సీఐ దేవయ్య,కాగజ్‌నగర్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన సీఐ సంజయ్, కౌటాల సీఐ సంతోష్, జైపూర్ ఎస్ఐ ఎల్. భూమేష్,భీమారం ఎస్ఐ ఎ.రాజేందర్ పాల్గొన్నారు.

## డిసిసిబి చైర్మన్ ను ఘనంగా సన్మానించిన ఉద్యమకారులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** డిసిసిబి చైర్మన్గా ఎన్నికైన కొత్తకుర్మ సత్తయ్యను ఘనంగా సన్మానించిన తెలంగాణ ఉద్యమకారుల పోరం నాయకులు. మంగళవారం రంగారెడ్డి జిల్లా, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం, డిసిసిబి చైర్మన్గా మరొకసారి ఎన్నికైన కొత్తకుర్మ సత్తయ్యను, తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు తుర్కయంజాల్ రైతు సేవా సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. మరోసారి పిఎసిఎస్ డిసిసిబి చైర్మన్గా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని ఉద్యోగ ఉద్యమకారులు తెలిపారు. ప్రభుత్వం తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించడం సంతోషంగా ఉందని, జిల్లా రైతాంగానికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని, డిసిసిబి చైర్మన్ సత్తయ్య అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో టియుఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి నక్క జంగయ్య గౌడ్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అందెకర్ బాబూలాల్, తుళ్ల నరసింహా గౌడ్, బచ్చిగళ్ళ రమేష్ కొల్లూరు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు అమూల్యం

### ఈఎస్ఐ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు




**కుషాయిగూడ, మహా :** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ బాబు హాజరై నర్సుల సేవలను అభినందించారు. వైద్య సేవలలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ 1 డాక్టర్ వీణారాణి, ఆర్ఎంఒ 2 డాక్టర్ శ్వేత, టీజీడీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సతీష్, ఎల్ఎస్‌టీ మోతాడ, టీఎన్‌జీవో అధ్యక్షుడు వాసు, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ గ్రేడ్ 1 ప్రీతి, టీఎన్‌జీవో, ఐఎంఎస్ ఫోరం ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గాంధీ ఆసుపత్రి అధ్యక్షురాలు దేవనమ్మ పాల్గొన్నారు. ఈఎస్ఐ నాచారం బ్రాంచ్ అధ్యక్షురాలు జి. విక్టోరియా, కార్యదర్శి వి. వేణుకుమార్‌తో పాటు అరుణ, భాగ్య, చంద్రకళ, అంజని, రఘు, సంతోష్, కుమార్, శ్రీలత, వినీల తదితర నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బందిని సన్మానించి సేవలను కొనియాడారు.

## ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ... గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు.

## క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

### జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఉన్న క్రీడా ప్రాంగణాలు, పార్కులనుజోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి తో కలిసి మంగళవారం సందర్శించారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన క్రీడా మైదానాలతో పాటు క్రీడా ప్రాంగణంలో అని సదుపాయాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. అనువైన క్రీడా మైదానాలను గుర్తించి తదుపరి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు.సర్కిల్ కి సంబంధించిన అధికారులుఆయా ప్రాంగణాల పరిస్థితులను పరిశీలించి, అభివృద్ధి చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ప్రజలకు మరింత మెరుగైన క్రీడా వసతులు మరియు పచ్చదనం కల్పించే లక్ష్యంతో రాజేంద్రనగర్ జోన్‌లో పార్కులు మరియు క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలోఎస్,ఈ నరేందర్ గౌడ్, డిఈఈ యాదయ్య వివిధ సర్కిల్ సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలి

- పేపర్ లీకులపై కనీసం స్పందించని కేంద్ర ప్రభుత్వం...
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్



**రాజేంద్రనగర్ మహా ;** ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకుల కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మార్చిందన్నారు. ఎన్ టి ఏ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించింది. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష లీకులపై కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా కేంద్రీకరణను తగ్గించి నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ హక్కులను రాష్ట్రాలకు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే వై ప్రణయ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకులపై సమగ్ర విచారణ జరిపి బాదులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## వాయుపుత్ర సంకటమోచనుడుని అంగరంగ వైభవంగా జయంతి వేడుకలు...

### మారుతీ కేసరి నందనుడుని స్మరిస్తూ పులకించిన భక్తులు

**రాజేంద్రనగర్, మహా ;** హనుమాన్ జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, పలు దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి నియోజకవర్గంలోని బుద్వేల్ గ్రీన్ సిటీ, నార్సింగీ, మంచిర్యాల దేవాలయంలో అంజని పుత్ర పవనసుత వీరాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలతో హనుమాన్ చాలీసా పఠనం, రామ నామ జపం చేశారు. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ ఏర్పాటు చేసినభజన కార్యక్రమంలో భక్తులతో కలిసి ఆంజనేయ స్వామిని స్మరిస్తూ భక్తులు పులకించారు. సందర్భంగా మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి. భక్తులందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ చైర్మన్ ఇంట్లో వికసించిన మే పుష్పం..

### మక్కువతోనే పూల మొక్కలు పెంచుతాను చైర్మన్ పాండురంగ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సంవత్సరానికి ఒకసారి పూసే మే పుష్పం పిఎసిఎస్ చైర్మన్ ఇంట్లో వికసించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ ఏదుళ్ళ పాండురంగారెడ్డి ఇంట్లో మే పుష్పం వికసించడంతో సంతోషం వ్యక్తం చేశారు. మొక్కలలో చాలా అరుదుగా సంవత్సరానికి ఒకసారి పువ్వులు పూసే మొక్కలలో మే పుష్పం ఒకటి. అయితే శేరిగూడ గ్రామానికి చెందిన పిఎసిఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి, మొక్కలపై మక్కువతో తన ఇంటి చుట్టూ పెరట్లో పూల మొక్కలను ఎక్కువగా పెంచుతూ ఉంటారు. ఈ సంవత్సరంలో ప్రస్తుతం మే నెల కావడంతో తన ఇంట్లో మే పుష్పం వికసించడంతో పలువురు చూడడానికి తరలివచ్చారు. దీంతో ఆయన తన ఇంట్లో మే పుష్పం వికసించడం ఎంతో సంతోషంగా ఉందని, పూల మొక్కలను పండ్ల మొక్కలను పెంచడం తనకే ఎంతో ఇష్టమని ఈరోజు తమ ఇంట్లో మే పుష్పం పూయడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు సహించం

### కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరిక



**కుషాయిగూడ, మహా :** ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించే కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ స్పష్టం చేశారు. జవహర్ నగర్ పరిధిలోని పలు సర్వే నంబర్లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సర్వే నంబర్లు 207, 240, మరియు 384 లలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా బేస్మెంట్లు, ఇళ్లను నిర్మిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో స్పందించిన రెవెన్యూ బృందం:వివిధ ప్రాంతాల్లో వెలిసిన అక్రమ కట్టడాలను జేసీబీలతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అక్రమ వెంచర్లు, అనధికారిక కట్టడాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

### మే 16 నుండి పనులు బంద్



**కుషాయిగూడ, మహా :** నిర్మాణరంగంలో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగినందున ముడి సరుకుల ధరలకు అనుగుణంగా నిర్మాణదారులకు నూతన ధరలు చెల్లించాలని జవహర్ నగర్ నిర్మాణ రంగ కాంట్రాక్టర్లు సమ్మె బాట పట్టారు. కీసర సర్కిల్, జవహర్ నగర్ బాలాజీ నగర్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణ రంగంలో ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం, పెరిగిన నిత్యావసర ధరలు ఇంటి అద్దెల దృష్ట్యా పాత ధరలకు పనులు చేయడం సాధ్యం కాదని కార్మిక సంఘం,అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్,ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్,స్పష్టం చేశారు. పెరిగిన ధరల వివరాలు నిర్మాణ రంగానికి సంబంధించి సెంట్రింగ్, ఇసుక, కంకర, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ మెటీరియల్ ధరలు పెరగడం వల్ల కాంట్రాక్టర్లు భారీగా నష్టపోతున్నారని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది.

**మే 16 నుండి రెండు వారాల పాటు సమ్మె**

తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ నెల 16 నుండి రెండు వారాల పాటు పనులు నిలిపివేస్తున్నట్లు సంఘం ప్రకటించింది. ఈ సందర్భంగా గల్లీ గల్లీ తిరుగుతూ అవగాహన కల్పిస్తామని, భవన యజమానులు అనుభవం కలిగిన వారు తమ కష్టాన్ని గుర్తించి సహకరించాలని కోరారు. పెరిగిన ధరల వల్ల చేసిన కష్టానికి గిట్టుబాటు కావడం లేదు. కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. న్యాయమైన ధరలు లభించే వరకు మా పోరాటం ఆగదన్నారు.భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులుఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కోయాడ వెంకటేష్, అధ్యక్షులు చిన్నపురం యాదయ్య, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాటి బాబు, రమణారెడ్డి, కోశాధికారి కోట్ల చెన్నారెడ్డి, మాధవ్, ఏ.ఎఫ్.టి.యు రాష్ట్ర నాయకులు వై. మల్లేష్, శ్రీను, వెంకటేష్, ఐలయ్య పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ దాడులు

- **ఎమ్మార్వో ఆర్ఐ సర్వేరు పై అవినీతి ఆరోపణలు...**
- **ప్రభుత్వ భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన..**
- **పై అధికారుల ఆదేశానుసారం చర్యలు: ఏసీబీ అధికారి ఆనంద్ కుమార్**



**రాజేంద్రనగర్ మహా:** శంషాబాద్ మండలంలోని ఎమ్మార్వో,ఆర్ఐ, సర్వేయర్లపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఏసీబీ అధికారి ఆనంద్ కూమార్ తెలిపారు. శంషాబాద్ తాసిల్దార్ కార్యాలయంలో వరుసగా మూడు వరోజుల పాటు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో భూ రికార్డులలో అవకతవకలు జరుగుతున్నాయని ఏసిబి అధికారులకు ఫిర్యాదు అందడంతో, వారంలోనే మూడోసారి తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా ఏసీబీ అధికారి ఆనంద్ కుమార్ నేతృత్వంలో దాడులు జరిపి, ప్రభుత్వ భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.. మొదటి రోజు ఎమ్మార్వో, ఆర్ఐ చరవాణిలను సీజ్ చేశారు. శంషాబాద్ మండలంలోని ఇనాం భూములు, ప్రభుత్వ భూములు ఎండోమెంట్ భూములు, శిఖం భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏసీబీ అధికారి ఆనంద్ మాట్లాడుతూ... శంషాబాద్ రెవెన్యూ మండలం ఎమ్మార్వో, ఆర్ఐ, సర్వేయర్లపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించామని జిల్లా ఏసీబీ అధికారి తెలిపారు. తనిఖీలు చేస్తున్న క్రమంలో ఎమ్మార్వో కారును పరిశీలించగా అందులో 69 వేల రూపాయలు ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. అనంతరం ఆర్ఐ దగ్గర 29వేల రూపాయలను కిటికీ నుంచి బయటకు విసరడం జరిగింది, సర్వేయర్ వద్ద ఉన్న పదివేల రూపాయలతో పట్టుబడడం జరిగిందని ఆయన తెలిపారు. మండల కార్యాలయంలోని భూ రికార్డులను పరిశీలించడం జరిగిందని వాటిల్లో అవకతవకలు ఉన్నట్లుగా అనుమానం వ్యక్తం అవుతుందని, అలాగే మండలంలోని పలు గ్రామాలలోని రికార్డులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, వాటిపై పరిశీలన చేయడం జరుగుతుందని, తదుపరి పై అధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐసిబి అధికారి ఆనంద్ అన్నారు.

**అవినీతి అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందా.!**

రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఏసీబీ దాడులు జరుగుతున్న పట్టించుకోకుండా అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు. ముఖ్యంగా రెవెన్యూలో ఈ అవినీతి అధికంగా జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంత జరుగుతున్న ఏసీబీ దాడులు జరుగుతాయన్న భయం ఏమాత్రం లేకపోయింది అవినీతికి రుచి మరిగిన అధికారులు ఏసీబీ దాడులను లెక్కచేయడం లేదు మరి ఈ వ్యవస్థ ఎటువైపు వెళ్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నారు అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది. ఈ అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వేసి చూడాల్సి ఉంది.

### హనుమజయంతి సందర్భంగా శ్రీ దాసాంజనేయ స్వామి
# ఆలయంలో విశేష పూజలు



**బూర్గంపహాడ్ మహా :** సారపాక సాకేతపురిలో వెలసిన శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయ సన్నిధిలో హనుమజయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ప్రాతఃకాలం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు, ఆకు పూజలు నిర్వహించి ప్రత్యేక కైంకర్యాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు సమిష్టిగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సనాతన హిందూ ధర్మ గో సామాజిక సేవకులు టి. గోవిందరెడ్డి మాట్లాడుతూ, సనాతన హిందూ ధర్మంలోని ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ప్రతి హిందువు పాటించాలని సూచించారు. హిందువుగా పుట్టినందుకు గర్వపడుతూ ప్రతి ఇంటిలో భగవద్గీత, రామాయణం, హనుమాన్ చాలీసా వంటి భగవన్నామాలను నిత్యం పారాయణం చేయాలని, పిల్లలకు కూడా అలవాటు చేయాలని కోరారు.అలాగే స్త్రీమాత, గోమాతలను గౌరవించి పూజించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఎక్కడైతే స్త్రీ, గోవు రక్షించబడతాయో, గౌరవించబడతాయో ఆ ప్రాంతం పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో అభివృద్ధి చెందుతుందని వేదశాస్త్రాలు చెబుతున్నాయని తెలిపారు.సారపాక ప్రాంత హిందువులంతా తమ సాంప్రదాయ పండుగలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని టి. గోవిందరెడ్డి పిలుపునిచ్చారు.




### సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ వద్ద
# ఘోర రోడ్డు ప్రమాదం

**జమాయిల్ పుల్ల ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు..**
**నలుగురికి తీవ్ర గాయాలు**

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జమాయిల్ పుల్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ యూటర్న్ తీసుకునే సమయంలో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వీరిలో శివకుమార్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో ముందుగా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన జమాయిల్ పుల్ల ట్రాక్టర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖమ్మంలో దొంగ నోట్ల కలకలం

- **ఆన్‌లైన్ పేమెంట్ పేరుతో గిరిజన మహిళలకు టోకరా**
- **ప్రశ్నిస్తే దాడులు.. అసలు నేరాన్ని కప్పిపుచ్చి వర్గపోరుగా కేటుగాళ్ల కుట్ర**
- **ఆన్‌లైన్ చేస్తారా.. క్యాష్ ఇస్తాం! ఖమ్మంలో వెలుగుచూసిన నయా మోసం**

**ఖమ్మం, మహా:** ఆన్‌లైన్ పేమెంట్ల యుగంలో సైబర్ నేరగాళ్లే కాకుండా, ప్రత్యక్షంగా కళ్లెదుటే మోసాలకు పాల్పడే ముఠాలు సైతం కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అత్యవసరంగా ఆన్‌లైన్ పేమెంట్ చేయాలంటూ అమాయకులను నమ్మించి, తీరా వారు డబ్బులు పంపిన తర్వాత నకిలీ నోట్లు అంటగడుతున్న ఘటన ఖమ్మం నగరంలో తీవ్ర కలకలం రేపింది. దొంగ నోట్లను నిలదీసిన పాపానికి బాధితులపై భౌతిక దాడులకు దిగడమే కాకుండా, అసలు నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఈ వ్యవహారాన్ని వర్గాల మధ్య గొడవగా మార్చిన తీరు స్థానికంగా సంచలనంగా మారింది నగరంలో నకిలీ నోట్ల చలామణికి ఓ ముఠా సరికొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఆన్‌లైన్ లావాదేవీల పేరుతో అమాయక ప్రజలకు దొంగ నోట్లను అంటగడుతూ మోసాలకు పాల్పడుతోంది. ఖమ్మం పాత మున్సిపాలిటీ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను విస్మయానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. ఇద్దరు గిరిజన మహిళలు ఫోటోలు దిగేందుకు స్థానికంగా ఉన్న ఓ ఫోటో స్టూడియోకి వెళ్లారు. అదే సమయానికి అక్కడికి ముస్లిం సంప్రదాయ వేషధారణలో వచ్చిన ఓ మహిళ వారిని మాటల్లో పెట్టింది. "తన స్నేహితులకు, బంధువులకు అత్యవసరంగా ఓ వెయ్యి రూపాయలు (ఆపై మొత్తం) ఆన్‌లైన్ ద్వారా పంపించాల్సి ఉందని, మీ ఫోన్ నుంచి ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే తాను ఆ మొత్తాన్ని వెంటనే నగదు (క్యాష్) రూపంలో ఇస్తానని" మాయమాటలు చెప్పింది. సదరు మహిళ మాటలు నమ్మిన గిరిజన మహిళలు, మానవతా దృక్పథంతో స్పందించి ఆమె చెప్పిన నెంబర్‌కు తమ ఖాతా నుంచి ఆన్‌లైన్ పేమెంట్ చేశారు. అనంతరం ఆ మహిళ వారికి నగదు అందజేసింది. అయితే, ఆ నోట్లను పరిశీలించిన గిరిజన మహిళలకు అవి నకిలీ నోట్లు అని అనుమానం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన వారు.. "ఈ నోట్లు తేడాగా ఉన్నాయి, మాకు ఇవి వద్దు.. మా పేమెంట్ మాకు తిరిగి కొట్టేయండి" అని సదరు మహిళను నిలదీశారు.

**ప్రశ్నిస్తే ఎదురుదాడి..**

అసలు రంగు బయటపడటంతో ఆ మహిళ, బాధితులపై ఎదురుదాడికి దిగింది. "నా దగ్గర ఈ నోట్లే ఉన్నాయి.. కావాలంటే తీసుకోండి, లేకుంటే లేదు" అంటూ దురుసుగా ప్రవర్తించింది. బాధితులు తమ డబ్బుల కోసం పట్టుబట్టడంతో, ఆమె వెంటనే తన స్నేహితులకు, బంధువులకు కబురు చేసి అక్కడికి రప్పించింది. గుంపుగా వచ్చిన వారు ఆ గిరిజన మహిళలపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు.

**నేరాన్ని కప్పిపుచ్చుకునే కుట్ర..**

తాము నకిలీ నోట్లు చలామణి చేస్తున్న విషయం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో సదరు దుండగులు పథకం ప్రకారం వ్యవహరించారు. తమ వర్గానికి చెందిన మరింత మంది వ్యక్తులను ఘటనా స్థలానికి రప్పించి, అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. దొంగ నోట్ల వ్యవహారాన్ని పూర్తిగా మరుగున పడేసి, రెండు వర్గాల మధ్య జరిగిన గొడవగా (కమ్యూనల్ ఇష్యూ) దీనిని చిత్రీకరించి నగరంలో హల్‌చల్ చేశారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని దొంగ నోట్లను చలామణి చేయడమే కాకుండా, ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడి మతపరమైన గొడవలుగా సృష్టించేందుకు ప్రయత్నించిన ఈ ఘటనపై పోలీసులు దృష్టి సారించాలని, ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

### బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలంటూ
# మణుగూరులో బీఆర్ఎస్ ధర్నా..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన, ధర్నా నిర్వహించారు. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ, బాలికలపై జరుగుతున్న దారుణాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికార పదవుల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులు చట్టానికి అతీతులు కారని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు పోషం నరసింహారావు, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్, నరసయ్య, జావిద్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.




# రూ.20 లక్షల భీమా క్లెయిమ్ చెక్కు అందజేత

- ప్రాంతీయ మేనేజర్ నాగరాజు

**బూర్గంపహాడ్ మహా :** కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడంలో భీమా పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ నాగరాజు అన్నారు. బూర్గంపాడులోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నందు నిర్వహించిన కార్యక్రమంలో బుడ్డగూడెం గ్రామానికి చెందిన మృతుడు సోడె నరేష్ కుటుంబ సభ్యులకు SBI జనరల్ ఇన్సూరెన్స్ GPAI పథకం ద్వారా రూ.20 లక్షల మరణ భీమా క్లెయిమ్ చెక్కును నామినీ సోడె గోపయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, జీవితంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో ముందుగా చెప్పలేమని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచేది భీమా పథకాలేనని పేర్కొన్నారు. చిన్న మొత్తంలో ప్రీమియం చెల్లించడం ద్వారా కుటుంబ భవిష్యత్తుకు పెద్ద భరోసా పొందవచ్చని తెలిపారు.SBI లైఫ్ ఇన్సూరెన్స్ అందిస్తున్న జీవిత భీమా పథకాలు కుటుంబాలకు రక్షణ కవచంలా నిలుస్తాయని ఆయన చెప్పారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినా పిల్లల చదువు, కుటుంబ అవసరాలు ఆగిపోకుండా ఈ పథకాలు ఆదుకుంటాయని వివరించారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో జీవిత భీమా, ప్రమాద భీమా, వృద్ధాప్య భద్రత పొందవచ్చని తెలిపారు. "భీమా తీసుకోవడం అనేది ఖర్చు కాదు..కుటుంబ భవిష్యత్తుకు పెట్టుబడి" అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ భీమా పథకాలలో చేరి తమ కుటుంబాన్ని ఆర్థికంగా రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బూర్గంపాడు సర్పంచ్ నాగరాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బూర్గంపాడు శాఖ మేనేజర్ ప్రసాద్, ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**దమ్మపేట ,మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు ,బండి సాయి భగీరథ ను తక్షణమే అరెస్ట్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. స్థానికంగా ఉన్న మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద రాష్ట్ర రహదారిపై కొద్దిసేపు బైఠాయించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ మాట్లాడారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ మీద మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఈరోజు వరకు భగీరథను అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ వేత్త కుటుంబ సభ్యుడు కాబట్టే బండి సాయిని కాపాడే ప్రయత్నం చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసించారు. బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుండి సస్పెండ్ చేయాలని, బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు.17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన దారుణం జరిగితే, మూడు నెలల నుండి ఎఫ్ఐఆర్ నమోదు చేయించడానికి బాధితుల కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడి పై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పోక్సో కేసుల్లో పేద ప్రజలకు ఒక న్యాయం,నేతల కుటుంబాలకు మరో న్యాయమా? అంటూ "బేటీ బచావో" అనేది కేవలం బీజేపీ నినాదమేనా, లేక నిజంగా బాధితురాలికి న్యాయం జరుగుతుందా ప్రధాని నరేంద్ర మోదీ పై ద్వజమెత్తారు.బాధితురాలికి అండగా నిలవాల్సింది పోయి... రాష్ట్ర కాంగ్రెస్ పాలనలో బాధిత మైనర్ బాలికపైనే రివర్స్ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రజా పాలకులు సమాదానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో
# తుమ్మల పాత్ర మరువలేనిది

- **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
- **తుమ్మల 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై ఆత్మీయ సభ**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాత్ర మరువలేనిదని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశంసించారు. చుంచుపల్లి మండలం పరిధిలోని కమ్మ సత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిలో మంత్రి తుమ్మల అగ్రగామిగా నిలుస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే అవినీతి రహిత ఆదర్శ నేతగా చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి తుమ్మల అని స్పష్టం చేశారు. తుమ్మల ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తారు గానీ గెలిచిన తరువాత ఏ పార్టీ నాయకుడికైనా అభివృద్ధికి సంబంధించిన ఏ పనినైనా చేసి పెడతారని చెప్పారు. తాను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రతిసారీ తుమ్మల సహకారం మార్చిపోలేనిదని వివరించారు. వామపక్షాలతో పొత్తు ధర్మానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన నేత తుమ్మల అని కొనియాడారు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన ఘనత తుమ్మల నాగేశ్వరరావుకే దక్కుతుందన్నారు. ఆయన ఇంకా నలభై సంవత్సరాలు రాజకీయంలో ఉంటు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**అభివృద్ధికి చిరునామా తుమ్మల...**

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి చిరునామాగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు నిలుస్తారని పలువురు వక్తలు కొనియాడారు. ఏజెన్సీ వాసుల తలరాత మార్చిన మన్యం సూర్యుడు తుమ్మల అని వివరించారు. రహదారులతో పల్లెలు ప్రగతి బాట పట్టించిన రథ సారథి తుమ్మల అని చెప్పారు. పామాయిల్ సాగుకు బాటలు వేసిన మార్గదర్శకుడు అన్నారు. ఎన్టీఆర్ దీవెనలతో రాజకీయాల్లో అడుగుపెట్టి క్రమశిక్షణతో పదవులు అంటే ప్రజా సేవ అని ఆదర్శ రాజకీయాలకు బాటలు వేసిన అజాత శత్రువు గాంధేయ వాది తుమ్మల అని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకుల మన్ననలు పొందిన ప్రజా నాయకుడు తుమ్మల అంటూ అభివర్ణించారు. ముందు తరాలకు మేలు చేసే పనులు చేసిన సోషల్ రిఫార్మర్ అని ప్రశంసించారు. సాగునీటి ప్రాజెక్టులు జాతీయ రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేశారన్నారు. ఎన్టీఆర్ అడుగు జాడల్లో చంద్రబాబు దార్శనికత బాటలో కేసీఆర్ తో సాన్నిహిత్యం ప్రస్తుతం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో మంత్రిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కాలం మంత్రిగా రికార్డ్ నమోదు చేసిన అరుదైన నాయకుడు తుమ్మల నాగేశ్వరావు అని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు మల్లెల రవి చంద్ర, ఎస్కే సాబీర్ పాషా, బిక్కసాని నాగేశ్వరరావు, నాగ సీతారాములు, మోత్కూరి ధర్మారావు, గడిపెల్లి కవితతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు, మంత్రి తుమ్మల నాగేశ్వరావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


# ఇసుకాసురులు దొరికారు

- **ఆంధ్ర ఉచిత ఇసుక తెలంగాణలో అధిక రేట్లకు విక్రయం**
- **నిందితులకు పోలీస్ శాఖ పలు హెచ్చరికలు చేసిన దంద ఆపని వైనం**
- **ఇసుక దందాకు ఉపయోగించిన వాహనాలు సీజ్, నిందితులకు రిమాండ్**

**సత్తుపల్లి, మహా:** సరిహద్దు ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలకు ఉచితంగా అందిస్తున్న ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే సమాచారంతో రంగంలోకి దిగిన సత్తుపల్లి పోలీసులు కేసును చాకచక్యంగా చేదించారు. బేతుపల్లి గ్రామానికి చెందిన గద్దల శీను, గద్దల శివ, కొవ్వారపు నాగేంద్రబాబు అను నిందితులు ఆంధ్రాలోని కొవ్వూరు గోదావరి ఇసుక ర్యాంపు నుండి ఏపీ 39 టియు 7377, ఏపీ 39 డబ్ల్యు ఎం 6512, ఏపీ 39 టీబి 5679, ఏపీ 04 యుబి 0396, ఏపీ 39 డబ్ల్యూ బి 3566, ఏపీ 39 యు 7377 లారీలకు ఇసుక లోడ్ చేసుకొని టీఎస్ 04 ఈ కే 9339 క్రెటా కార్ లో పహారా కాస్తు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై గత నెల 21 న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న సమయంలో లారీ డ్రైవర్ పువ్వారపు నాగేంద్రబాబు (ఏ 3), గద్దల శివ (ఏ 1) తమ దగ్గర ఉన్న క్రెటా కార్ లో పారిపోయారు. ఈ ఘటనపై కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఆదేశాలతో, సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి సూచనలతో పరారీలో ఉన్న నిందితులను ఎస్.ఐ పి.ప్రదీప్ సారథ్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇసుక దందాకు సూత్రధారుడైన గద్దల శ్రీను (ఏ 2) విజయవాడ ప్రాంతంలోని ద్వారక లాడ్జ్ లో బస చేస్తున్నాడు అనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని తమ వద్ద ఉన్న క్రెటా కార్ ను సీజ్ చేశారు. అనంతరం నిందితున్ని కోర్టుకు హాజరపరిచారు. నేర పరిశీలన అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశానుసారం నిందితుడ్ని సబ్ జైల్ కు తరలించారు. ఇసుక అక్రమార్కులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ ప్రదీప్ బృందాన్ని ఏసిపి వసుంధర యాదవ్, ఇన్స్పెక్టర్ శ్రీహరి ప్రశంసించారు.

### రానున్న 15 రోజులు
# పంటల కొనుగోళ్లకు అత్యంత కీలకం

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రానున్న 15 రోజులు మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమని క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న నిల్వలు లోడింగ్ పరిస్థితులు గోడౌన్ల అందుబాటు రవాణా సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై కారణాలను అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు.గోడౌన్ల అందుబాటు కోసం బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారు చిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నందున త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్క్‌ఫెడ్, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు రవాణా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా విషయంలో లోడింగ్ కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు పాఠశాల భవనాలు ఇతర అనుకూల భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నిరంతరం నివేదికల రూపంలో అందించాలని, కొనుగోలు పూర్తైన వెంటనే 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్, డిసీఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు లోడింగ్ అన్‌లోడింగ్ గోడౌన్ల పరిస్థితి హమాలీల అందుబాటు గన్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




### సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఘనంగా
# అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా జరిగాయి. రోగుల సేవలో నిరంతరం శ్రమిస్తూ వైద్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న నర్సుల అంకితభావాన్ని ఈ సందర్భంగా యాజమాన్యం వైద్య బృందం కొనియాడింది. ముందుగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేయడంతో వేడుకలు ప్రారంభమయ్యాయి.నర్సింగ్ సిబ్బంది అందరూ తమ వృత్తి పట్ల నిబద్ధతతో ఉంటామని రోగులకు నిరంతరం సేవలందిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు నర్సులకు ఆసుపత్రి ఉన్నతాధికారులు "ఉత్తమ నర్స్" అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ "వైద్యుడు చికిత్స అందిస్తే, ఆ చికిత్స విజయవంతం కావడంలో నర్సుల సేవలు ఎంతో కీలకం. సింగరేణి కార్మికుల ఆరోగ్య సంరక్షణలో మీ పాత్ర వెలకట్టలేనిదని ప్రశంసించారు. నర్సుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సింగరేణి ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్లు వైద్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చర్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- **విద్యార్థులకు మార్గదర్శకాలు**
- **ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను వినియోగించుకోవాలని పిలుపు**



**చర్ల మహా :** చర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈరోజు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి సామ్రాజ్యం గారు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈరోజు పదో తరగతిలో అనుత్తీర్ణత పొందిన విద్యార్థులను ఉత్సాహపరుస్తూ వారికి భవిష్యత్తుపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు నిరుత్సాహానికి లోనుకాకుండా మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఉపాధ్యాయులు, అధికారులు సూచించారు.ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు మాట్లాడుతూ విద్యార్థుల నడవడిక, మానసిక పరిస్థితులు, చదువుకునే విధానాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రోత్సహించాలని అన్నారు. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రెండు జతల యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు, ఉదయం రాగి జావా, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఉచిత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంనుంచి విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులతో కూడిన స్కూల్ కిట్లు కూడా ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

# సింగరేణి ఆసుపత్రి నర్సులకు ఘన సన్మానం..

**మణుగూరు, మహా :** అంతర్జాతీయ నర్స్ డే సందర్భం గా మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో సేవలందిస్తున్న నర్సులను టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానిం చారు. ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో నర్సులకు శాలువాలు కప్పి, పూల మొక్కలు, మిఠాయి పొట్లాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడుతూ సేవాభావంతో సమాజానికి అండగా నిలిచే నర్సుల సేవలు వెలకట్టలేని వని అన్నారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనకోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సుల పాత్ర మరువలేనిదని



పేర్కొన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరిం చుకుని అంతర్జాతీయ నర్స్ డే నిర్వహిస్తారని, రోగులకు అంకితభావంతో సేవలందించిన ఆమె స్ఫూర్తితో నర్సు లను సన్మానించడం ఆనందదాయకమని తెలిపారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ దిశాని ర్దేశం, హాస్పిటల్ డివైసీఎంఓ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందుతు న్నాయని అన్నారు. గనుల్లో పనిచేసే కార్మికులు అనారో గ్యానికి గురైనప్పుడు, ప్రమాదాల సమయంలో ఆసుపత్రి కి వచ్చే ప్రతి ఒక్కరికీ నర్సులు సేవలందిస్తున్నప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్య సహాయం, మందుల పంపిణీ, ఆరోగ్య సూచనలు అందిస్తూ విశేష సేవ చేస్తున్నారని చెప్పారు. పగలు, రాత్రి తేడా లేకుండా విధుల నిర్వర్తిస్తూ రోగులకు ధైర్యం చెప్పడం, వైద్యులకు సహకరించడం వంటి బా ధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న నర్సుల సేవలను గుర్తించి సన్మానించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్‌కుమార్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, ఇమ్రాన్ ఖాన్, కళ్యాణ్‌కుమార్, మొగిలి రాజయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ

**మణుగూరు, మహా :** హనుమాన్ జయంతి సందర్భం గా మణుగూరులోని పీవీ కాలనీ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం భక్తిశ్రద్ధ లతో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు శివ కామేశ్వరి గ్రూప్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, నాగరాజు, షఫీ పాల్గొని సేవలందిం చారు. అలాగే సంక శ్రీనివాస్, వాసవి క్లబ్ ప్రతినిధు లు చిట్టూరు శేషుబాబు, శ్యామ్, గౌరీశంకర్, ఆలయ



కమిటీ సభ్యులు ఊటుకూరు సత్యనారాయణ, నాని తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో భక్తులు కా ర్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నిర్వాహకులను అభినందించారు.

## బూర్గంపహాడ్ రామాలయంలో ఘనంగా హనుమత్ జయంతి వేడుకలు

**ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమ నిర్వహణ**

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మం గళవారం హనుమత్ జయంతి వేడుకలను భక్తిశ్ర ద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హనుమాన్ స్వామి ఆరాధనలు భక్తి పారవశ్యంతో సాగాయి. వాసు శర్మ, సత్యవ్రత శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కా ర్యక్రమం నిర్వహించి భోజన వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చంద్రా కృష్ణ ప్రసాద్, సభ్యులు సంకా లక్ష్మణ్, తోడేటి శివ, గ్రామ పెద్దలు, భజన సతీష్ తదితరులు కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొ



న్నారు. భజనలు, భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కా ర్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహణ

**మణుగూరు, మహా :** అంతర్జాతీయ నర్సుల దినోత్స వం సందర్భంగా మణుగూరు మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా కార్యక్ర మం నిర్వహించారు. ఆధునిక నర్సింగ్‌కు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించు కుని ప్రతి సంవత్సరం మే 12న నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ కేవలం నర్స్ మాత్రమే కాకుండా సేవకు ప్రతిరూపమని కొనియాడారు. క్రిమియన్ యుద్ధ సమయంలో గాయపడిన సైనికులకు ఆమె అందించిన సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని తెలిపారు. రాత్రివేళ చేతిలో దీపం పట్టు కుని రోగులను పరామర్శించేదిగా ఆమెను లేడీ విత్ ది ల్యాంప్‌గా పిలిచేవారని వివరించారు. నర్సింగ్ అంటే కేవలం మందులు ఇవ్వడం, ఇంజెక్షన్లు వేయడం మాత్రమే కాదని, రోగికి ధైర్యం చెప్పడం, ప్రేమతో మా ట్లాడడం, కుటుంబ సభ్యుడిలా చూసుకోవడం కూడా నర్సింగ్ సేవలో భాగమని తెలిపారు. డాక్టర్ చికిత్స



అందిస్తే, ఆ చికిత్సకు సేవ అనే రూపం ఇచ్చేది నర్సు లేనని అన్నారు. ప్రస్తుతం సమాజంలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం కోసం నిస్వార్థంగా సేవ చేశారని కొనియాడారు. పగలు రాత్రి తేడా లేకుండా ఆసుపత్రుల్లో పని చేస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలిచారని చెప్పారు. నర్సింగ్ అనేది ఉద్యోగం కాదని, ఓపిక, ప్రేమ, కరుణ, త్యాగం కలిసిన గొప్ప సేవా యజ్ఞమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి నర్సుకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ, వారు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ అంజన ఆనియన్స్ అండ్ ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి
- సుమారు 2000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ
- వృద్ధాశ్రమంలో వృద్ధులకు, గిరిజన ప్రాంతాల్లో హనుమాన్ దేవాలయాల్లో అన్నప్రసాద పంపిణీ


**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం, సార పాకలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళ వారం శ్రీ అంజనా ఆనియన్స్ & ట్రేడర్స్ వారి ఆధ్వ ర్యంలో ఉదయం హనుమాన్ చాలీసా, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా భద్రాచలం శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్స రాలుగా హనుమాన్ జయంతి సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో నాగరత్నం ,దేవి రేఖ దంపతులు శ్రీ అంజన ఆనియన్స్ & ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి హనుమాన్ దీక్ష స్వీకరించి భద్రా చల శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్య దర్శనమునకు విచ్చేసిన రామ భక్తులకు ,హనుమాన్ భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిం



దని, అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హనుమాన్ ఆల యాలకు ఇక్కడినుండే అన్న ప్రసాదం అందించడం జరుగుతుందని ,మరియు భద్రాచలం వృద్ధాశ్రమము నకు కూడా ఇక్కడి నుండే అన్న ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాతలకు ,సేవకులకు భద్రాచల సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ సుధూర ప్రాంతాల నుండి హనుమాన్ మాల స్వీకరించి భద్రాచలం దర్శనానికి వచ్చిన మాకు ఇక్కడ అన్న ప్రసాద వితరణ కార్యక్ర మంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు .ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**భద్రాచలం మహా :** భద్రాచలం, వెంకటేశ్వర కాలనీ లోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విశేష పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన కార్యక్రమాలు హనుమాన్ జయంతి ని పురస్కరించుకుని స్వామి వారికి విశేషంగా ఆకు పూజ నిర్వహించారు. సీతా రాముల కల్యాణ మహోత్సవం: లోక కల్యాణం కోసం శ్రీ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, కనుల పండువగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ: కల్యాణం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

**భక్తుల సందడి:**

ఈ వేడుకను తిలకించడానికి భద్రాచలం పరిసర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివ చ్చారు. భక్తులంతా స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు.

**ముఖ్య అతిథులు మరియు పాల్గొన్నవారు:**

అన్న ప్రసాద వితరణ దాత: బోగాల శ్రీనివాస రెడ్డి దంపతులు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖు లు పాల్గొని స్వామివారి సేవలో తరించారు. వారిలో ముఖ్యులు:భోగాల శ్రీనివాస రెడ్డి, విష్ణుమొలకల రామ్ ప్రసాద్, రేపాక రాంబాబు, రేపాక రవికిరణ్, రే పాక సతీష్, పునేం కృష్ణగారు సర్పంచ్, వెంకటేశ్వర్లు తాసిల్దార్పుల్లయ్య ఆర్టీవో, తాండ్ర నరసింహారావు, అ న్నెం రామిరెడ్డి, రాసమళ్ల రాము, పద్మ, వసంతల రా జేశ్వరి, తుమ్మల రాణి, వీరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్త సమాజం మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## సంస్థ పట్ల అంకితభావంతో విధులు నిర్వహించాలి..

**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థ పట్ల అంకిత భావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించా లని అదనపు జనరల్ మేనేజర్ (పర్సనల్) ఎస్ రమేష్ సూచించారు. మంగళవారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన పర్సనల్, సంక్షేమ విభాగాల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పర్సనల్ విభాగ అధికారులు, సంక్షేమ అధికారులు, పర్సనల్ అధికారులు, మినిస్ట్రియల్ సిబ్బంది పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎస్ రమేష్ మాట్లాడుతూ పర్సనల్, సంక్షేమ విభాగాలు ఉద్యోగుల ప్రయోజనా లకు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. గైర్హాజరైన కార్మికులకు సంబంధించిన 2024, 2025 సంవత్సరాల చార్జ్‌షీట్ విచారణలను సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న ఇతర విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించి, మాజీ ఉద్యో గుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, క్లెయిమ్‌లు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. సమాచార హక్కు దరఖాస్తులకు సం బంధించిన వివరాలను సకాలంలో సంబంధిత అధికారులకు అందజేయాలని, కోర్టు కేసుల పురోగ తిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగుల కార్పొరేట్ జీత ఖాతాలు సంబంధిత బ్యాంకుల్లో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ



విరమణ ప్రయోజనాలు, నిధి, పెన్షన్, గ్రాట్యుటీ, వైద్య పథకాల క్లెయిమ్‌లకు సంబంధించిన పత్రా లను జాప్యం లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. క్వార్టర్ల కేటాయింపు, పీనల్ రెంట్, గృహభత్య వివ రాలను డిజిటలైజేషన్ చేయాలని, అర్హులైన ఉద్యో గులకు షెడ్యూల్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని ఆదేశించారు. డిజిటల్ సేవల వినియోగంపై ఉద్యో గుల్లో అవగాహన పెంచాలని, మాజీ ఉద్యోగులు తమ పెన్షన్, వైద్య పథకాల పునరుద్ధరణ పనులను మీ సేవ కేంద్రాల ద్వారా చేసుకోవచ్చని తెలియజేశారు. మెడికల్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఫోటోలు, ఆధార్ వివ రాలను సేకరించి పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా చేరిన ఉద్యోగులకు నిధి నంబర్ల కేటాయింపును వేగవంతం చేయాలని సూచించారు. సీనియర్ అధికారులు సింగు శ్రీనివాస్, వి రామేశ్వరరావు, డిజి సంక్షేమ అధికారులు చంద్ర కిరణ్, వంశీకృష్ణ, సాయి మౌనిక, డిప్యూటీ సూపరిం టెండెంట్ ఎం. నరసింహారావు, మధు, ఎన్ వేంకటే శ్వరరావు, షాబుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సుభాని, వివిధ విభాగాల మినిస్ట్రియల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సారపాక ఈస్ట్ గేటు వద్ద రోడ్డు ప్రమాదం

**బూర్గంపహాడ్ మహా :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఐటీసీ పిఎస్పీడీ కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తె లుస్తుంది ఘటన స్థానంలో ఉన్న స్థానికులు 108కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 లో గాయపడిన వ్యక్తిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు ఈ సంఘటన గల పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



## కొత్తగూడెంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో ప్ర త్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం సాయంత్రం సమయంలో హనుమంతుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుంచుపల్లి మండలం విద్యానగ ర్ కాలనీ నుండి హనుమాన్ విగ్రహాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. హనుమాన్ విగ్ర హాల ర్యాలీతో హోరెత్తింది. లక్ష్మీదేవిపల్లి మండలం ముర్రేడు బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో కూడా పెద్ద ఎత్తున పూజలు నిర్వహిం చారు. రైటర్ బస్తి పెద్దమ్మ తల్లి, శ్రీ త్రిమాత దేవాల



యంతో పాటు పలు హనుమంతుడి దేవాలయాల్లో అభిషేకాలు జరిగాయి. హనుమాన్ జయంతి సంద ర్భంగా హనుమాన్ గుడిలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**జూలూరుపాడు, మహా:** హనుమాన్ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకు న్నారు. ఏకువజామునే ఆలయాల వద్దకు భక్తులు చేరుకొని తోరణ అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పడమట నర్సాపురం గ్రామంలోని శ్రీ సీతారామచం ద్ర స్వామి ఆలయంలో అర్చకులు పురాణం శ్రీనివాస శర్మ హనుమాన్ జయంతి సందర్భంగా గోత్రనామ అర్చన, అభిషేకం, ఆకు పూజ, హనుమాన్ చాలీసా పారాయణం తో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా పాపకొల్లు గ్రామంలో భక్తులు జైశ్రీరామ్ ర్యాలీని నిర్వహించారు. భక్తుల కు అన్నప్రసాద వితరణ చేశారు. జూలూరుపాడు,



వెంగన్నపాలెం, అనంతారం, కాకర్ల, గుండెపుడి, బేతాళపాడు, కరివారిగూడెం, రాజారావుపేట, జూ లూరుపాడు షిరిడి సాయి మందిరం తదితర ఆల యాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆలయాలు భక్తుల రామ నామ స్మరణతో మార్మోగాయి. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధనుర్బాణ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతుల పూజలు

**గోదావరిఖని:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, వారి సతీమణి మనాలి ఠాకూర్ కలిసి మంగళవారం హనుమాన్ జంక్షన్ గుట్టపై వెలసిన ప్రసిద్ధ ధను ర్బాణ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకాలుఆలయ అర్చకులు వేదమంత్రో చ్చారణల మధ్య స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నా రు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. నియోజకవ ర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యా లతో వర్ధిల్లాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చర్లలో బీఆర్ఎస్ పార్టీ ధర్నా

**బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్**

**చర్ల మహా :** చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వ ర్యంలో మంగళవారం మెయిన్ రోడ్డు సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి Bandi Sanjay Kumar ను పదవి నుంచి తొలగించాలని, ఆయన కుమారుడు సాయి భగీరత్‌ను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ సం దర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ, సాయి భగీరత్‌పై పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలకు ఒక నీతి, మంత్రి కుటుంబానికి మరో నీతి అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్ర తలు పూర్తిగా అదుపుతప్పాయని, ఒక మైనర్ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధితురాలు మరియు ఆమె కుటుంబాన్ని నేరస్థుల్లా వేధించడం దారుణమని మండిపడ్డారు. “బేటీ బచావో - బేటీ పడావో” అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు కేంద్ర సహాయ మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఒక మైనర్ బాలిక



అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు చర్ల తహ సీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. డి. అజీజ్, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, కొంబ త్తిని రాంబాబు, అంబోజి సతీష్, తోటపల్లి మాధవ రావు, సంతపురి సతీష్, కారం కన్నారావు, గోరింట్ల వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు బేతంచర్ల నర్సవేణి, ఉపసర్పంచులు ఎడ్ల రామదాసు, కొప్పుల సత్యనారాయణ, కట్టం కన్నారావు, కుక్కడపు సాయి, పాసిగంటి సంతోష్, అలవాల కృష్ణ, కనుక వీరభద్రం, వంకాయల వినోద్ కుమార్, శ్యామల సాంబశివరావు, తడికల వెంకటేశ్వర్లు, కొంగురి నరసింహారావు తదిత రులు పాల్గొన్నారు.

## ఇరవెండిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం

**వడదెబ్బ నివారణ, పరిశుభ్రతపై ప్రజలకు సూచనలు**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలోని పల్లె దవాఖానాలో గ్రామ ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకా హారం మరియు అసాంఘిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అలాంటి పరిస్థితు ల్లో శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసు కోవాలని, ఓఆర్ఎస్ వినియోగం ఎంతో అవసరమని ప్రజలకు వివరించారు. అలాగే అసాంఘిక వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి అంటుకోవని, బాధితులను



చిన్నచూపు చూడకుండా వారికి మానసిక ధైర్యం ఇవ్వాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్య క్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం సుందర వేణి, ఆశా వర్క ర్లు, మొదటి వార్డు సభ్యురాలు కేలోత్ దుర్గ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మణుగూరులో- వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు మంగళ వారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పివి కాలనీ క్రాస్‌రోడ్డులోని హనుమాన్ ఆలయంలో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమై



పాలు, తమలపాకులతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. హనుమంతుడు భక్తి, బలం, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన దేవతగా భావిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. పివి కాలనీ శ్రీరామాలయం, కూనవరం రామాలయం, సమితి సింగారం శ్రీ సీతారామాలయం, శివలింగా పురం రామాలయాలలో కూడా హనుమాన్ జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు భజనలు, మంత్రోచ్చారణలతో మార్మోగా యి. శ్రీరాముని నామస్మరణతో హనుమంతుడు చిరంజీవిగా భక్తులను కాపాడుతాడనే విశ్వాసంతో భక్తులు తీర్థప్రసా దాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో నిండిన వాతావరణం నెలకొనగా, మణు గూరులో హనుమాన్ జయంతి వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## దమ్మపేటలో భద్రతా చర్యలు కట్టుదిట్టం

**అన్ని షాపులకు సీసీ కెమెరాలు తప్పనిసరి – నోటీసులు జారీ చేసిన ఎస్సై సాయికిషోర్ రెడ్డి**

**దమ్మపేట ,మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట ప్రజల భద్రత, వ్యాపార సంస్థల రక్షణ మరియు నేర నియంత్రణ లక్ష్యంగా పోలీసులు కీలక నిర్ణయం తీ సుకున్నారు. ఈ మేరకు మంగళవారం అన్ని వ్యాపార కేంద్రాలకు సూచనలు



,నోటీసులు జారీ చేశారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని షాపులు, వాణిజ్య సముదాయాలు, బంగారు దుకాణాలు, మెడికల్ షాపులు, ఫైనాన్స్ కార్యాలయా లు, హోటళ్లు, గోదాములు, మొబైల్ షాపులు, ఎలక్ట్రాని క్ దుకాణాలు తదితర వ్యాపార సంస్థల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై సాయికిషో ర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వ్యాపార సంస్థల యజమానులకు పోలీస్ శాఖ తరపున ప్ర త్యేక నోటీసులు అందజేస్తూ త్వరితగతిన కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ ఘటనలు, రాత్రి వేళల్లో అనుమానా స్పద కదలికలు, ట్రాఫిక్ సమస్యలు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల కీలక పాత్ర :**

సీసీ కెమెరాలు కేవలం భద్రతకే కాకుండా నేరాల నివార ణలో కూడా అత్యంత కీలకమని పోలీసులు పేర్కొన్నారు. చిన్నచిన్న దొంగతనాల నుంచి పెద్ద నేరాల వరకు సీసీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించడం సులభమవు తుందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దుకాణాల వద్ద జరిగే చోరీలు, వాహనాల దొంగతనాలు, గొడవలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం వంటి ఘటనలను గుర్తించడంలో కెమెరాలు సహాయపడతాయని వెల్లడిం చారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్టాండ్ పరి సరాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, ఏటీఎంలు ఉన్న ప్రాంతాల్లో మరింత నిఘా అవసరమని పోలీసులు అభిప్రాయపడ్డారు. వ్యాపారులు తమ షాపుల ముందు భాగం, లోపలి ప్రాంతం, నగదు లావాదేవీలు జరిగే ప్రదేశాలు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**30 రోజుల రికార్డింగ్ తప్పనిసరి :**

కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా కనీసం 30 రోజులపాటు వీడియో రికార్డింగ్ భద్రపరిచే విధంగా డీవీఆర్ లేదా స్టోరేజ్ వ్యవస్థ ఉండాలని ఎస్సై స్పష్టం చేశారు. అవసరమైన సమయంలో పోలీసులు అడిగిన వెంటనే ఫుటేజ్ అందించేలా యజమానులు సహక రించాలని కోరారు. కొన్ని వ్యాపార సంస్థలు కెమెరాలు అమర్చినా అవి పనిచేయని పరిస్థితులు కనిపిస్తున్నా యని, అలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా కెమెరాల నిర్వహణపై కూడా దృష్టి పెట్టాలని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయం వచ్చినా రికార్డింగ్ కొనసాగేం దుకు బ్యాకప్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# గ్లామర్ డోస్ పెంచిన ప్రియా ప్రకాష్ వారియర్..

## గత్తర లేపుతున్న ముద్దుగుమ్మ

ప్రియా ప్రకాష్ వారియర్ గురించి తెలుగు ప్రేక్షకులుకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. మొదటి సినిమాతో ఎంతగా క్రేజ్ సంపాదించుకుందో అందరికి తెలిసిందే. 'ఒరు ఆధార్ లవ్' అనే చిన్న మలయాళ చిత్రం నుండి సోషల్ మీడియాలో స్టార్ అయిపోయిన ఈ బ్యూటీకి అప్పటి నుండి మంచి క్రేజ్ అందుతోంది.ఓ సింపుల్ వింక్ తో కుర్రకారుని ఆకట్టుకుని ఒక్క స్మైల్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రియా ప్రకాష్ వారియర్.సౌత్ లో ఒక్కటంటే ఒక్క హిట్ సినిమా తగలకపోవడంతో బ్యాడ్ టైం నడుస్తోంది. అందుకే ఈవిధంగా సోషల్ మీడియాలో రెచ్చిపోతోంది.చిన్నప్పడే క్లాసికల్ డాన్స్ నేర్చుకున్న ఈ కేరళ కుట్టి ..ఇప్పడు మాత్రం మోడ్రన్ మోనాలిసాలా మారిపోయింది.నితిన్ చెక్ సినిమాలో నటించిన ప్రియా ఆ తర్వాత చాలా రోజులకు తెలుగులో పవన్ కళ్యాణ్ బ్రోలో యాక్ట్ చేసింది. రీసెంట్ గా ఈ అమ్మడు సిగ్గులు ఒలకబోస్తున్న ఫోటోలను నెటిజన్ల కోసం షేర్ చేసింది. ఈ కేరళ భామ ఫోటోలు చూసి కళ్లు తిప్పకోలేకపోతున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

ANN తెలుగు

మహా పత్రిక 09

బుధవారం, హైదరాబాద్ | 13-05-2026

జిల్లా వార్తలు DISTRICT NEWS

WWW.MAHAADAILY.COM

## నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి : ఏఓ ప్రమోద్ కుమార్



**పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకొని, శాస్త్రీయ పద్ధతులను పాటిస్తేనే రైతులకు మేలైన ఆదాయం లభిస్తుందని జగిత్యాల పొలాస వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా. టి. ఎల్లా గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా,ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం PJTSAU ఆధ్వర్యంలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం మంగళవారం పాలకుర్తి రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. ఎల్లా గౌడ్ మాట్లాడుతూ, రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా, జీవన ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వరి కొయ్యలను కాల్చకుండా, ట్రాక్టర్‌తో భూమిలోనే కలియదున్నాలని, తద్వారా సేంద్రియ కర్బనం పెరుగుతుందని వివరించారు. వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వానాకాలం సీజన్‌లో సన్నరకాలను సాగు చేయడం వల్ల ప్రభుత్వ మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 అదనపు బోనస్ లభిస్తుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి నకిలీల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు.పంట మార్పిడిలో భాగంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు దీర్ఘకాలిక లాభాల కోసం ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బి. శశిధర్ మరియు పాలకుర్తి మండల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్.**



**రామగుండం:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆధునిక ప్రయోగశాలలు ఎంతగానో ఉపయోగపడతాయని రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రామగుండంలోని PM SHRI ZPHS పాఠశాలలో తెలంగాణ విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక హైస్కూల్ ప్రయోగశాల భవనాన్ని ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో (Scientific Temper) పరిశోధనలు చేస్తూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.రామగుండం పట్టణ రూపురేఖలు మార్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో వెలుగులు నింపేలా ప్రధాన రహదారుల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ మరియు మెరుగైన డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు. కేవలం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న వారికి తాము చేసే అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం చెబుతామని ఆయన ఘాటుగా హెచ్చరించారు.రాబోయే రోజుల్లో రామగుండం నియోజకవర్గంలోని పాఠశాలలకు మరిన్ని నిధులు మంజూరు చేయించి, మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రాన్నే ఆదర్శంగా నిలుపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**





**గోదావరిఖని:** ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉంటుందని, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సాధిస్తారని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి, సమాజంలో మంచి గౌరవప్రదమైన స్థానాల్లో నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## అరుణ్ ఉన్నత చదువులకు బీర్ల ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**బీర్ల అయిలయ్య ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే హామీ**



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కేంద్రంలోనిశ్రీ గౌతమ్ హై స్కూల్ నిరుపేద విద్యార్థి కొంపల్లి అరుణ్ కుమార్ ఉన్నత చదువులకు బీర్ల ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే మంగళవారం నాడు హామీ ఇచ్చారు. అరుణ్ కుమార్ SSC పరీక్షల్లో 600మార్కులకు గాను 563 సాధించి టాఫర్ గా నిలిచారు...నిరుపేద విద్యార్థి ఇంటర్ చదువులకు ఆర్థిక సహాయం కోరుతూ శ్రీ గౌతమ్ హై స్కూల్ కరస్పాండెంట్ మిర్యాల దుర్గా ప్రసాద్ విద్యార్థి తల్లి ఝాన్సీ ఎమ్మెల్యేను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో విద్యార్థి అరుణ్ కుమార్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించి ఇంటర్ చదువులకు ఆర్థికంగా ఆదుకుంటామని మాట ఇచ్చారు.

## మదర్ డెయిరీ అభివృద్ధికి కీలక ఒప్పందం

**బీర్ల అయిలయ్య కృషితో మదర్ డెయిరికి భారీ ప్రోత్సహం..**



**యాదాద్రి భువనగిరి /హైదరాబాద్, మహా:** మదర్ డెయిరీ అభివృద్ధి మరియు పాడి రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు మరియు మదర్ డెయిరీ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు వాకిటీ శ్రీహరి , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలాం బర్తి , మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, అలాగే NDDB సంస్థకు చెందిన సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్ , సౌత్ రీజినల్ హెడ్ ఆర్మీ జకబ్ , డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ కుమార్ పాల్గొని విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం పరస్పర సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటీ శ్రీహరి మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య పాత్ర పోషించారు. వారి సమన్వయంతో పాడి రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరినట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు అధికారులు మదర్ డెయిరీ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల చెక్కును మంత్రి వాకిటీ శ్రీహరి మరియు విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా మదర్ డెయిరీ ప్రతినిధులకు అందజేశారు. ఈ నిధులతో పాల సేకరణ కేంద్రాల విస్తరణ, శీతలీకరణ కేంద్రాల ఆధునీకరణ, రైతులకు సాంకేతిక సౌకర్యాల కల్పన, పాడి పరిశ్రమ విస్తరణ, అలాగే పెండింగ్‌లో ఉన్న రైతుల బిల్లుల చెల్లింపులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ:"తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పాడి రైతులు ఆర్థికంగా బలపడాలంటే పాల ఉత్పత్తి రంగాన్ని ఆధునికీకరించడం అత్యంత అవసరం. NDDB మరియు మదర్ డెయిరీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించడం, పాల సేకరణను పెంచడం, ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాడి రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి యువతకు కూడా ప్రయోజనం చేకూరుతుంది" అని పేర్కొన్నారు.

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో సిఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్





**యాదాద్రి భువనగిరి, మహా:**ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు.మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారువీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా కూడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసుల సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పని చేయాలని సీఎం ఆదేశించారు.ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావొద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ. 4,178 కోట్లను ఆమోదించిందని తెలిపారు.ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 14 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా ఇప్పటికే 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు.అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు.హమాలీలు, గన్నీ సంచులు, నిల్వ సామర్థ్యం అంశాలపై కలెక్టర్లతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ. 8.50కు పెంచినట్లు చెప్పారు. అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు .ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం లోడ్ లను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకొని కాంటా వేయాలని, కాంటా వేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేసి,కాంటా వేసిన వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల వద్ద కాని మిల్లుల వద్ద కాని హమాలీల సరిపడ లేకపోతే హమాలీల సంఖ్య పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు అవసరమైతే అదనంగా లారీలు పెట్టాలన్నారు. ట్రాన్స్పోర్ట్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లుల వద్ద ఒక ప్రత్యేక అధికారిని నియమించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కొనుగోలు ఆలస్యం కాకుండా వెంటనే పరిష్కరించేందుకు ఒక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి ప్రతిరోజు నివేదికలు సమర్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఆలేరులో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



**ఆలేరు మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వాగు నది తీరాన కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జయంతోత్సవాలు ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమ ముఖ్య అతిథి ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి అంజనేయులు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్క హనుమాన్ భక్తుడు పై ఉన్నదని అన్నారు ...శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆలేరులో హనుమాన్ జయంతోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు అలాగే శ్రీరామ్ సేన ఆలేరు ఆధ్వర్యంలో 25 అడుగుల భగవద్వజాన్ని స్థానిక ఆలేరు మున్సిపాలిటీ ఐదవ వార్డ్ కౌన్సిలర్ శివాజీ సేన అధ్యక్షుడు పాశికంటి సంపత్ ఆవిష్కరణ చేశారు ఆయన మాట్లాడుతూ ప్రతి హైందవ సోదరుడు హిందూ సనాతన ధర్మాన్ని రక్షించాలని, గోమాతలను వధ శాలలకు తీసుకెళ్లే రాక్షసుల అంతం చూడాలని శ్రీరామ్ సేన బజరంగ్దళ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ హనుమాన్ జయంతో సభ కార్యక్రమంలో శ్రీరామ్ సేన అధ్యక్షుడు మైదాం భాస్కర్, ప్రధాన కార్యదర్శి పేరపు ఆనంద్, అభయ ఆంజనేయ స్వామి దేవాలయ అధ్యక్షుడు ఆలేటి ఎలేందర్, జనరల్ సెక్రెటరీ కుంతవతు కమలాకర్, ఆలయ కమిటీ కార్యదర్శి అలేటి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి పడకంటి చంద్రశేఖర్ , బజరంగ్దళ్ ఆలేరు కన్వీనర్ కొమ్ము శ్రావణ్, ఉపాధ్యక్షుడు జూకంటి సంపత్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్ల హరీష్ ,చింతకింది వినయ్, సామల వినీత్, కౌతారపు సాయి, మెరుగు భాను, చింతగింది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## 15వ ఆర్థిక సంఘం నిధులపై సమీక్ష

**యాదాద్రి భువనగిరి, మహా:**పంచాయతీ రాజ్ కమీషనర్, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాను సారం జిల్లా పరిషత్తు మరియు మండల పరిషత్తుకు సంభందించిన 15 వ ఆర్థిక సంఘం, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ పనుల ప్రగతి పై, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ రూల్ 2026 పై అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యములో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారుఈ కార్యక్రమంలో ముఖ్యకార్యనిర్వాహనాధికారి శోభారాణి , నాగిరెడ్డి డిఆర్డిఓ, డిఆర్ఓ జయమ్మ, డిపిఓ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ వివిధ గ్రాంట్ ల పనులపై సమీక్షించారు.ఈ సమావేశంలో వివిధ మండలాల మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, తదితర అధికారులు పాల్గొన్నారు.


## పేపర్ లీక్ నిందితులకు జైలు తప్పదు

**ఎన్టీఏ చీఫ్ సీరియస్ వార్నింగ్**



**హైదరాబాద్, మహా:** దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కావడం పెద్ద దుమారం రేపుతోంది. మే 3న జరిగిన ఈ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మంగళవారం నాడు అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. ఈ పేపర్ లీక్‌కు పాల్పడిన వారందరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రతి ఒక్కరినీ పట్టుకొని జైలుకు పంపుతామని ఆయన గట్టిగా హెచ్చరించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పరీక్షను రద్దు చేయడమే సరైన నిర్ణయమని ఆయన సమర్థించుకున్నారు. కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.ప్రాథమిక విచారణలో తేలిన అంశాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మే 3న పరీక్ష జరగడానికి ముందే, అంటే మే 1 మరియు 2 తేదీల్లోనే కొన్ని ప్రశ్నలు పీడీఎఫ్ ఫైల్ రూపంలో వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల్లో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రశ్నలు అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలడం చూసి ఎన్టీఏ విస్తుపోయింది. ఇది సంస్థ యొక్క 'జీరో టాలరెన్స్' విధానానికి పూర్తి విరుద్ధమని, అందుకే ఈ కేసును లోతుగా దర్యాప్తు చేయడానికి కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)కి అప్పగించారు. ఈ నిర్ణయం ద్వారా నిందితులను త్వరగా పట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, ఈ స్కామ్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రస్తుతానికి సమాధానం ఇవ్వడానికి నిరాకరించడం రాజకీయంగా చర్చకు దారితీస్తోంది. ఇక విద్యార్థుల ఆందోళనను గమనించిన ఎన్టీఏ, రీటెస్ట్ విషయంలో కొన్ని ఊరటనిచ్చే ప్రకటనలు చేసింది. మళ్ళీ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఎటువంటి కొత్త ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాదు, గతంలో చెల్లించిన రుసుమును కూడా ప్రభుత్వం తిరిగి ఇచ్చేస్తుంది. అభ్యర్థులు మళ్ళీ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు; పాత వివరాలు మరియు వారు ఎంచుకున్న పరీక్షా కేంద్రాలే చెల్లుబాటు అవుతాయని ఎన్టీఏ స్పష్టం చేసింది. త్వరలోనే రీఎగ్జామ్ తేదీలను మరియు కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తారు. సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరైన ఈ అతిపెద్ద పరీక్ష ఇలా రద్దు కావడం బాధాకరమే అయినప్పటికీ, నిష్పక్షపాతంగా మళ్ళీ పరీక్ష నిర్వహించడమే తమ లక్ష్యమని ఎన్టీఏ పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, కేవలం అధికారిక వార్తలను మాత్రమే అనుసరించాలని విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు సూచించింది.

## ఈనెల 15వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోరుతూ ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందజేత..



**వలిగొండ, మహా:** 2006 సంవత్సరంలో తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తూ నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని రెండుసార్లు ఫోటోలు తీర్చే విధానం రద్దు చేయాలని ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో వలిగొండ మండల ఎంపీడీవో కు సమ్మె నోటీసు అందించడం జరిగిందిసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఈ నెల 15న చేపట్టే దేశవ్యాప్త జయప్రదంకు సహకరించాలని కోరారు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన చట్టం వల్ల ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం కావడంతో పాటు కూలీలు పనులు చేసేందుకు ముందుకు రారన్నారు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులను భరించాలని చెప్తున్న ఈ చట్టంలో రాష్ట్ర ప్రభుత్వం భరించకపోతే కూలీలు పనులు లేకుండా ఉండాల్సిన పరిస్థితులు వస్తాయని కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఆత్మ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు,వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు గుంటూరు సత్తయ్య,చేగురి నగేష్ లు పాల్గొన్నారు



### ధాన్యం కొనుగోల్లు
## వేగవంతం చేయాలి

**ఆలేరు తహశీల్దారు ఆంజనేయులు**

**ఆలేరు, మహా:**ఆలేరు, కొలనుపాక ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలేరు తహశీల్దారు వలిగొండ ఆంజనేయులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సెంటర్ ఇన్ చార్జలను ఆదేశించారు.

### బి ఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ కుటుంబాన్ని
## పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సదాశివపేట :మహా :** ఆత్మకూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపిటిసి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ కుమారుడు సాయి విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆత్మకూరు గ్రామంలోని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా సాయి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, మెరుగైన వైద్యం సక్రమంగా కొనసాగించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గడీల సుధీర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బేగరి సుధాకర్, నాయకులు రాందాస్, భీమన్న, రాజు గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.